SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 30 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 6 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



కూతురి కులాంతర
## వివాహం
నమ్మించి కిడ్నాప్ చేయ-
ఁబోయిన తల్లిదండ్రులు

.. వివరాలు 2లో

## దారుణం
రెండేళ్ల కూతురితో సహా
హుస్సేన్ సాగర్‌లో దూకి
తల్లి ఆత్మహత్య!



.. వివరాలు 2లో



గతేడాది హర్యానా
అసెంబ్లీ ఎన్నికల్లో
## ఓట్ల చోరీ
25 లక్షల ఓట్లు
నకిలీవేనని గుర్తించాం:
రాహుల్ గాంధీ

రాహుల్ వ్యాఖ్యలను
## తోసిపుచ్చిన
ఎన్నికల సంఘం

.. వివరాలు 2లో

త్వరలోనే బీజేపీలో
# బీఆర్ఎస్ విలీనం

ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది **అవి ఒక్కటే!**



గత పార్లమెంట్ ఎన్నికల్లో
వీరి బంధం బట్టబయలు

మైనార్టీలకు కాంగ్రెస్ అండ
ఉంటుందన్న సీఎం

రేవంత్‌తో భేటీ అయిన
క్రైస్తవ సంఘాల నేతలు

**హైదరాబాద్, నవంబర్ 5:** బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్, బీజేపీపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు.

మిగతా 2 లో

కాంగ్రెస్ అంటే
## ముస్లింలు
అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే
ఎందుకు నొప్పి



3



# బీహార్‌లో ఎన్డీయే కూటమిదే విజయం

మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు

ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ

న్యూఢిల్లీ : బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బిహార్లో తాను ఎన్నికల ప్రచారం

మిగతా 4 లో

## మహిళా క్రికెట్ జట్టుకు మోడీ ఆతిథ్యం
వారిని మనసారా అభినందించిన ప్రధాని



## మల్టీప్లెక్స్‌లో మండుతున్న ధరలు
ఇలా అయితే థియేటర్ల మూత తప్పదు
హెచ్చరించిన సుప్రీంకోర్టు



3



# జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మరోమారు
కేబినేట్ కమిటీ భేటీ

చంద్రబాబుకు
తుది నివేదిక
అందించే యత్నం

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో సచివాలయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల బృందం బుధవారం సమావేశమైంది. ఈ భేటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత పాల్గొన్నారు. వర్చువల్‌గా మంత్రి నారాయణ, సత్య కుమార్ యాదవ్ ఈ సమావేశానికి

మిగతా 5 లో


పరిశ్రమలతో యూనివర్సిటీల
## అనుసంధానం
ఉన్నతవిద్యపై సమీక్షలో లోకేశ్ ఆదేశం



అమరావతి : ఉన్నత విద్యపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ఉన్నత విద్యపై సచివాలయంలో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు మంత్రి లోకేష్. యూనివర్సిటీలకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్‌ను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు మంత్రి

మిగతా 5 లో

# టెక్నాలజీయే శక్తి
భవిష్యత్‌పైనే నా దృష్టి.. లండన్‌లో చంద్రబాబు



- విజన్ ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్న చంద్రబాబు
- భవిష్యత్ తరాల కోసమే మా ప్రణాళికలన్న ఏపీ సీఎం
- మొంథా తుపాను సమయంలో టెక్నాలజీ వాడి నష్టాన్ని తగ్గించామని వెల్లడి

**అమరావతి :** "మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా దూరదృష్టితో ప్రణాళికలు రచించడం, ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి టెక్నాలజీని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించుకోవడమే సుపరిపాలన లక్ష్యం. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, అభివృద్ధి చెందిన ప్రపంచాన్ని అందించడమే మా కర్తవ్యం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

మిగతా 5 లో

# నువ్వు మగాడివైతే.. మగ పుట్టుక పుడితే..

దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం రా!


ఎవరు ఏం చేశామో వివరిద్దాం

సమాధానం చెప్పే సత్తా ఉంది

సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్



.. వివరాలు 3లో



## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్
ముగ్గురు మావోల హతం



ఖరీఫ్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల
## ధాన్యం సేకరణ
**రూ.12,200 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలుకు సిద్ధం**

**పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

**అమరావతి :** ఈసారి ఖరీఫ్ మాసానికి 51 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనేందుకు సిద్ధం అయ్యామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అంటే రూ. 12,200 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలుకు

మిగతా 2 లో

# బీజేపీలో త్వరలోనే బీఆర్ఎస్ విలీనం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కరిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో



కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు. అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణెళిష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.



## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

**ముగ్గురు మావోయిస్టుల హతం**

**ఖమ్మం, నవంబర్ 5:** ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం, మారిమల్ల అడవుల్లో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని మావోయిస్టులను భద్రతా దళాలు చుట్టుముట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమైనట్లు సమాచారం. భద్రతా దళాలు సంఘటనా స్థలంనుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా అదే ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే, మావోయిస్టుల మృతిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## బకాయిలు చెల్లించాల్సిందే

**8న కళాశాలల అధ్యాపకులతో సభ**

**ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య వెల్లడి**

**హైదరాబాద్, నవంబర్ 5:** ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు తమ ఆందోళన క ఒనసాగుతుందని ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య వెల్లడించింది. బకాయిలు చెల్లించకుండా బెదరింపులకు దిగడం సరికాదని, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు బంద్ కొనసాగిస్తామని సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. గత నాలుగు రోజులుగా బంద్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా డిమాండ్‌లను పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం. ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న కళాశాలల అధ్యాపకుల సభ నిర్వహిస్తాం. సుమారు 70వేల మంది దీనికి హాజరవుతారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిందని చెప్పారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయి. కళాశాల విద్య కమిషనర్ దేవసేన ఎంతగానో వేధిస్తున్నా భరిస్తూ వచ్చాం. ఆమెను ఆ విభాగం నుంచి బదిలీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూడు నెలలకు బదులు ఒక నెలలోనే కమిటీ రిపోర్టు అడగాలి. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి. కాలేజీలపై విజిలెన్స్ దాడుల్లో నియంతృత్వ ధోరణి కనిపిస్తోందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే 10లక్షల మంది విద్యార్థులతో భారీ సభ నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులతోనే తమ సమస్యలను చర్చిస్తామని అన్నారు.

## కూతురి కులాంతర వివాహం

**నమ్మించి కిడ్నాప్ చేయబోయిన తల్లిదండ్రులు**



**జగిత్యాల, నవంబర్ 5:** వాళ్లిద్దరు మనస్ఫూర్తిగా ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఆరేళ్ల ప్రేమలో ఉన్న వారు కులాంతర వివాహం చేసుకొని పెళ్లిబంధంతో ఒక్కటయ్యారు. అయితే ఇది నచ్చని వధువు తల్లిదండ్రులు కూతురిని నమ్మించి కిడ్నాప్‌కు ప్రయత్నించారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లికి చెందిన మర్రి రాకేష్‌తో పెద్దపెల్లి జిల్లా పాలకుర్తికి చెందిన ప్రియాంక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కాగా, కులాంతర వివాహానికి ప్రియాంక తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో వారు ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే కొన్ని నెలల తర్వాత ప్రియాంకకు ఆమె తల్లి ఫోన్ చేసి మాట్లాడి కలిసిపోయినట్లు నటించారు. జరిగింది ఏదో జరిగిపోయిందని సొంతి ఊరికి రమ్మని నమ్మబలికారు. వారి మాటలు నమ్మి వెళ్లగా మార్గమధ్యంలో ప్రియాంకను ఆమె తల్లిదండ్రులు, బావ కిడ్నాప్ చేయడానికి యత్నించారు. ఎలాగోలా స్థానికుల సహాయంతో తప్పించుకున్న ప్రియాకం తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

**నలుగురు మృతిసంగారెడ్డి జిల్లా వాసులు**

సంగారెడ్డి, నవంబర్ 5: కర్ణాటకలోని హల్లిఖేడ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాను, కారు ఢీకొన్న ఈ ఘటనలో నలుగురు తెలంగాణవాసులు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40)గా గుర్తించారు. వీరంతా గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

## బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

**హైదరాబాద్, నవంబర్ 5:** కుటుంబ కలహాలతో వివాహిత తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే గుర్తు తెలియని శవంగా పోలీసులు భద్రపరిచారు. చివరకు దర్యాప్తులో ఆమెను కీర్తిక అగర్వాల్‌గా గుర్తించారు. లేక్ పోలీసుల వివరాల ప్రకారం..పాతబస్తీలో నివాసముంటూ వ్యాపారం చేస్తున్న పృథ్వీలాల్, చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కీర్తిక అగర్వాల్(28) దంపతులు. వీరికి రెండేళ్ల కుమార్తె బియ్యారా ఉంది. దంపతుల మధ్య గొడవలతో ఆమె ఏడాదిన్నర కిందటే బహదూర్‌పురలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్ద కుమార్తెతో కలిసి ఉంటోంది. ఈనెల 2న హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు లభ్యం కాకపోవడంతో మార్చురీకి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమ కుమార్తె, మనుమరాలు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కీర్తిక అగర్వాల్‌గా గుర్తించిన ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావించి పరిశీలించగా మంగళవారం పాప మృతదేహాన్ని గుర్తించారు.



## మల్టీప్లెక్స్‌ల్లో మండుతున్న ధరలు

**ఇలా అయితే థియేటర్ల మూత తప్పదు • హెచ్చరించిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, నవంబర్ 5:** దేశంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు బాగా తగ్గిపోయాయి. మల్టీప్లెక్స్‌ల హవా నడుస్తోంది. అయితే, టికెట్ రేట్ల దగ్గరినుంచి తినే వస్తువుల వరకు మల్టీప్లెక్స్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మినిమం టికెట్ ధర 200 రూపాయలు పైనే ఉంటోంది. కొన్ని మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్ ధర 100 రూపాయలు.. కాఫీ ధర 700 రూపాయలు ఉంటోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు మల్టీప్లెక్స్‌లకు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మల్టీప్లెక్స్‌లపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యధిక ధరలు ఇలానే కొనసాగితే సినిమా హాళ్లు మూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. మల్టీప్లెక్స్‌లలోని టికెట్ రేట్లు 200 రూపాయల వద్ద ఉండాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో పాటు మరికొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధించింది. కానీ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అమ్మే ప్రతీ టికెట్‌కు సంబంధించిన ఆడిటబుల్ రికార్డ్స్ మెయిన్‌టేన్ చేయాలని ఆదేశించింది. అంతేకాదు.. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు నిర్ణయంపై ఓ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహ్తా బెంచ్ తాజాగా విచారణ జరిపింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. 'మీరు వాటర్ బాటిల్‌కు 100 రూపాయలు, కాఫీకి 700 రూపాయలు తీసుకుంటున్నారు' అని అన్నారు. ఇందుకు మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరఫున కేసు వాదిస్తున్న అడ్వకేట్ ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 'తాజ్ హోటల్‌లో కాఫీకి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. మరి మీరు ఆ రేట్‌ను ఫిక్స్ చేస్తారా?' అని అడిగారు. ఇందుకు విక్రమ్ నాథ్ బదులిస్తూ.. 'ఈ రేట్లు స్థిరంగా ఉండాలి. సినిమా రంగం రోజురోజుకు దెబ్బ తింటోంది. ఇలాంటి సమయంలో జనం వచ్చి సినిమాను ఎంజాయ్ చేసేలా రేట్లు ఉండాలి. లేకపోతే సినిమా హాళ్లు ఖాళీగా ఉండాల్సి వస్తుంది' అని అన్నారు. ముకుల్ స్పందిస్తూ..'కర్ణాటక హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోమంటే ఎలా?. ఐడీ కార్డులు పెట్టుకుని థియేటర్లకు ఎవరు వస్తారు?' అని ప్రశ్నించారు.

## గతేడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ

**25 లక్షల ఓట్లు నకిలీవేనని గుర్తించాం: రాహుల్**



**న్యూఢిల్లీ, నవంబర్ 5:** బిహార్ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి అధికార బీజేపీ, ఎలక్షన్ కమిషన్‌లపై విరుచుకుపడ్డారు. గతేడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ స్థాయిలో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. 100 శాతం పక్కా ఆధారాలతో ఈ ఆరోపణలు చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ గెలుపును ఓటమిగా మార్చేందుకు వ్యవస్థాగత స్థాయిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని అన్నారు. హర్యానాలో రెండు కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 25 లక్షల ఓట్లు నకిలీవే' అంటూ ఢిల్లీలో తాజాగా నిర్వహించిన పత్రికా సమావేశంలో సంచలన ఆరోపణలు చేశారు. తన బృందం 5.21 లక్షల డూప్లికేట్ ఓటన్లు గుర్తించిందని అన్నారు. హర్యానాలోని ప్రతి ఎనిమిది ఓట్లలో ఒకటి నకిలీనేనని స్పష్టం చేశారు. తన ఆరోపణలపై ఓ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ కూడా ఇచ్చారు. ఒక బ్రెజిల్ నటి ఫొటోతో, సీమా, స్వీటీ, సరస్వతి వంటి పలు పేర్లతో ఏకంగా 22 సార్లు నకిలీ ఓట్లు వేశారని అన్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఎలక్షన్ కమిషన్ వర్గాలు రాహుల్ గాంధీ ఆరోపణల్ని కొట్టిపారేశాయి. ఎన్నికల సమయంలో ఓటర్ జాబితాపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని గుర్తు చేశాయి. హర్యానాలో 90 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే, పంజాబ్ హర్యానా హైకోర్టులో మాత్రం కేవలం 22 ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అంటే, ఎన్నికల ఫలితాలకు న్యాయపరమైన సవాళ్లు పరిమితమ నేందుకు ఇది సూచన అని ఈసీ వర్గాలు కామెంట్ చేస్తున్నాయి.

## ఆకాశంలో అద్భుతం




**హైదరాబాద్, నవంబర్ 5:** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. నవంబర్ 5వ తేదీ ఆకాశంలో చంద్రుడు సాధారణంగా కంటే పెద్దగా.. మరింత ప్రకాశవంతంగా కనిపించాడు. బుధవారం సాయంత్రం సరిగ్గా 6.49 గంటలకు చందమామ ఈ కనువిందు చేశాడు. దీనినే బీవర్ సూపర్ మూన్ అని పిలుస్తారు. పౌర్ణమి సమయంలో చంద్రుడు తన కక్ష్యలో తిరుగుతూ భూమికి అత్యంత సమీపంలోకి చేరడంతో ఈ అద్భుతం జరిగింది. ఈ సూపర్ మూన్ వేళ.. చంద్రుడు మామూలు కంటే 13 శాతం పెద్దగా.. 30 శాతం ప్రకాశవంతంగా కనిపించాడు. ఈ సారి భూమికి చంద్రుడు మరింత దగ్గరగా వచ్చాడు. ఈ సూపర్ మూన్ ఈ ఏడాదిలో ఏర్పడిన రెండోది. చంద్రుడు.. భూమి చుట్టూ తిరిగే కక్ష్య పూర్తిగా వృత్తాకారంలో ఉండదు. కానీ కక్ష్యలో తిరిగే సమయంలో భూమికి చంద్రుడు దగ్గరగా.. దూరంగా వెళ్తుంటాడు. ఈ పౌర్ణమి వేళ.. చంద్రుడు తన కక్ష్యలో భూమికి సమీపానికి వచ్చినప్పుడు సూపర్ మూన్ అని పిలుస్తారు. ఈ సమయంలో భూమికి చంద్రుడు దాదాపు 3,57,000 కిలోమీటర్ల దూరంలో ఉంటారు. ఈ నేపథ్యంలో సాధారణ పౌర్ణమి కంటే చంద్రుడు పెద్దగా కనిపించాడు. చంద్రుడు చేరుకునే సమయంలో భూమి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యకు సమీపంలో ఉన్న పెరజీ వద్ద సూపర్ మూన్ సంభవిస్తోంది.

## రాహుల్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన ఎన్నికల సంఘం

**సర్‌కు అనుకూలమో.. వ్యతిరేకమో చెప్పాలని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ, నవంబర్ 5:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పును బీజేపీ తారుమారు చేసిందని, 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది ఆయన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొంది. హర్యానాలో ఓటర్ల జాబితాపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని వివరించింది. హర్యానా ఎన్నికల ఫలితాన్ని బీజేపీ చోరీ చేసిందని, గెలుపు కోసం ఎన్నికల కమిషన్‌తో ఆ పార్టీ కుమ్మక్కయిందని రాహుల్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈసీ తాజా వివరణ ఇచ్చింది. హర్యానాలో కాంగ్రెస్‌కు దక్కాల్సిన అద్భుత విజయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా 'ఆపరేషన్ సర్కార్ చోరీ' జరిగిందని రాహుల్ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లు బీజేపీతో కుమ్మక్కయ్యారని అన్నారు. దీనిపై ఈసీ స్పందిస్తూ, 90 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 22 ఎలక్షన్ పిటిషన్లు మాత్రమే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపింది. బూత్‌లలో ఉన్న కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్ల పాత్రను ఈసీ నిలదీసింది. ఆ పార్టీ పోలింగ్ ఏజెంట్లు ఏం చేస్తున్నట్టు? ఓటరు ఎవరైనా అప్పటికే ఓటు వేసినట్టు అనుమానం వచ్చినా, ఓటరు ఐడెంటిటీపై అనుమానం వచ్చినా అప్పుడే అభ్యంతరం వ్యక్తి చేసి ఉండొచ్చని పేర్కొంది. పౌరసత్వ వెరిఫికేషన్‌తో పాటు డూప్లికేట్లను, చనిపోయిన వారిని, చిరునామా మార్చుకున్న ఓటర్లను తొలగించేందుకు చేపట్టిన ఎస్‌ఐఆర్‌ను రాహుల్ గాంధీ సపోర్ట్ చేస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? అని ఈసీ ప్రశ్నించింది. కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు ఎందుకు అభ్యంతరాలు లేవనెత్తలేదని ప్రశ్నించింది. ఒకే పేరు పదేపదే రాకుండా నిరోధించేందుకు రివిజన్ జరిగినప్పుడు కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు అభ్యంతరం చెప్పి ఉండవచ్చని పేర్కొంది. అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకూ బిహార్‌లో ఎస్‌ఐఆర్ సమయంలో కూడా కాంగ్రెస్ ఎందుకు అప్పీల్ చేయలేకపోయిందో చెప్పాలని పేర్కొంది. హర్యానాలో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, టాప్-5 ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పినప్పటికీ బీజేపీ గెలిచిందని న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ తెలిపారు. ఒక నియోజకవర్గంలో ఒక ఫోటోతో వంద ఓట్లున్నాయని, అనేక బూతులలో ఫేక్ ఓట్లున్నాయని, అక్రమాలు బయటకు రావద్దని ఎన్నికల సంఘం సీసీటీవీ ఫుటేజ్‌ను డిలీట్ చేసిందని ఆరోపించారు. బ్రెజిలియన్ మోడల్, యూపీ బీజేపీ ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లు, ఓటర్ల తొలగింపుతో హర్యానాలో గెలిచారని అన్నారు. యూపీ, హర్యానాలో వేల సంఖ్యల్లో డూప్లికేట్ ఓటర్లున్నారని, యూపీలో ఓటు వేసే వ్యక్తికి హర్యానాలో కూడా ఓటు ఉందని తెలిపారు. బిహార్‌లోనూ ఓట్ల చోరీ జరుగుతుందని, అక్కడ ఎన్నికల తరువాత ఓట్ల చోరీ అంశాన్ని బయటపెడతామని అన్నారు.

# మగాడివైతే.. మగ పుట్టకపుడితే.. చర్చిద్దాం రా!

- దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం
- ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్



**హైదరాబాద్, నవంబరు 5:** రేవంత్‌రెడ్డి నువ్వు మగాడివి అయితే.. మగ పుట్టుక పుడితే.. రా అభివృద్ధిపై చర్చిద్దాం.. ఎవరి నిజాయితీ పరుడో.. ఎవరు దొంగనో దేశం మొత్తం తెలుస్తది' అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్థమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా?.. తెలంగాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. స్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు. పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాలన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీహిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్న కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5328 కోట్లు ఖర్చు చేస్తే.. రెండేళ్ల రేవంత్ పాలనలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించి రేవంత్ ఓట్లు అడగాలని, గోపీనాథ్ వేసిన శిలాఫలకం జూబ్లీహిల్స్‌లో ఎక్కడికి పోయినా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు వచ్చాయని.. రేవంత్ పాలనలో ఎన్ని వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలే న్యాయనిర్ణేతలని.. జూబ్లీహిల్స్‌లో సరైన జవాబిస్తారన్నారు.



## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు

### బీజేపీ ఎంపీ నగేశ్ ఇంటిని ముట్టడించిన బీఆర్ఎస్

**ఆదిలాబాద్, నవంబర్ 5:** పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ వైఖరిని నిరసిస్తూ బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ ఎంపీ నగేష్ ఇంటి ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎంపీ నగేశ్ ఇంటి ముందు బైఠాయించారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకు దిగిన మాజీ మంత్రి తోపాటు బీఆర్ఎస్ నాయకులు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. సీసీఐ తేమ పేరిట పత్తి కొనుగోళ్లను నిరాకరిస్తూ రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. తేమతో సంబంధం లేకుండా సీసీఐ పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వర్షాలకు కారణంగా రైతులు పత్తి పంటను నష్టపోగా సీసీఐ పరిమితులు విధించడం సరికాదని అన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ల కాకుండా 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పత్తికి సుంకం తగ్గించి కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా ఖండించారు. ల్గ÷తుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

## కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

### ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 5:** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

## మహిళా క్రికెట్ జట్టుకు మోడీ ఆతిథ్యం

### వారిని మనసారా అభినందించిన ప్రధాని



**న్యూఢిల్లీ,నవంబర్5:** మహిళల వన్డే ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టును ప్రధాని మోడీ అభినందించారు. మీరు భారత పతాకను ఎగరేసారని ప్రశంసలు కురిపించారు. అసమాన ప్రతిభను పరదర్శించారని ప్రశంసించారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీని మహిళా క్రికెట్ జట్టు కలిసింది. దిల్లీలోని ప్రధాని నివాసంలో టీమ్‌ఇండియాకు మోదీ ఆతిథ్యం ఇచ్చారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జట్టు సభ్యులు సాయంత్రం ప్రధాని నివాసానికి చేరుకున్నారు. వరల్డ్ కప్ విశేషాలను టీమ్ ఇండియా క్రీడాకారిణులు మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ ఛాంపియన్లకు ప్రధాని అభినందనలు తెలిపారు. వరుసగా మూడు ఓటములు, సోషల్ మీడియాలో ఎదురైన ట్రోలింగ్‌ను సైతం ఎదుర్కొని గొప్ప విజేతగా నిలిచారంటూ ప్రశంసించారు. 2017 వరల్డ్ కప్ ÷నైల్‌లో భారత్ చివరి వరకు పోరాడినా విజయం సాధించకలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలీ రాజ్ నేతృత్వంలోని జట్టు నరేంద్ర మోదీని కలిసింది. తాజాగా ఆ విషయాన్ని ప్రధాని గుర్తు చేసుకున్నారు. అనంతరం భారత ప్లేయర్లు ప్రధానికి వరల్డ్ కప్ ట్రోఫీతోపాటు 'నమో 1' జెర్సీని అందజేశారు. ఈ సందర్భంగా వారితో ప్రధాని గ్రూప్ ఫోటో దిగారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రియాజ్‌తో నాకు సంబంధం లేదు

### సోషల్ మీడియా వార్తలను ఖండించిన ఆసిఫ్



**నిజామాబాద్, నవంబర్ 5:** నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్‌ను దారుణంగా హత్య చేసిన కరుడుగట్టిన నేరస్థుడు రియాజ్‌ను పోలీసులు ఎన్ కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్ కౌంటర్ మృతుడు రియాజ్ తో తనకు ఎలాంటి పరిచయం లేదని రియాజ్‌ను పట్టుకున్న ఆసిఫ్ వెల్లడించారు. కానిస్టేబుల్‌ను హత్య చేసిన నిందితుడు పారిపోతుంటే పట్టుకున్నానని తెలిపారు. నాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగ నోట్ల కేసు, వాహనాల దొంగతనానికి కేసులు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నా పేరుపై ఒక్క వాహనం లేదు, ఒక్క పోలీస్ కేసు లేదు అని ఆసిఫ్ వెల్లడించారు. తాను మెకానిక్‌ని కాదని.. తనది వెల్డింగ్ షాప్ అని, వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాని తెలిపారు. రియాజ్ ఎన్‌కౌంటర్‌పై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నాపై దుష్ప్రచారం చేస్తుంది అని ఆసిఫ్ మండిపడ్డారు.



## కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి

### అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు నొప్పి

### కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్

### మైఆనర్టీల మద్దతుతోనే తాను కొడంగల్‌లో గెలిచా

### జూబ్లీహిల్స్‌లో మరోమారు సిఎం రేవంత్ ప్రచారం

**హైదరాబాద్, నవంబర్ 5 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేట్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. భారత రాష్ట్ర సమితి పేరుతో భాజపా ఓట్లు అడుగుతోందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు బాధో చెప్పాలన్నారు. కిషన్‌రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదు. నిన్న నేను మాట్లాడిన మాటలను వక్రీకరించారు. మొదటి నుంచి నేను సెక్యులర్ భావాలు ఉన్న వ్యక్తిని. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు అనేక అవకాశాలు కల్పించింది. కొడంగల్‌లో నేను 3 సార్లు గెలవడానికి మైనార్టీల సహకారం ఉంది. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఇబ్బందులు లేకుండా చూశాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. ఎందుకు ఇవ్వొద్దో.. కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఏం ఇబ్బంది. ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ ఒక్కటేనన్నారు. ముస్లింలను భారత రాష్ట్ర సమితి మోసం చేస్తోంది. సవాల్ విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటుగా ఉంది. కేసీఆర్ పదేళ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారా అని సీఎం ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ అభివృద్ధిపై చర్చలకు రావాలని సవాల్ విసిరారని.. ఆయనకు సవాల్ విసరడం పారిపోవడం అలవాటేనని సెటైర్లు గుప్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తాను సవాల్ విసిరితే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో ఢిల్లీలో తేల్చుకోవాలని ఛాలెంజ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్‌రెడ్డి చెప్పాలని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో అసలు బీజేపీనే లేదని దెప్పిపొడిచారు. ఇక్కడ బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని పేర్కొన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సెంటిమెంట్ పనికి రాదని విమర్శించారు. ఒకవేళ సెంటిమెంట్ అయితే పీజేఆర్‌పై పోటీ పెట్టింది బీఆర్ఎస్ కాదా..? అని అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌కి ఏం ఇచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని అభివర్ణించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఉద్ఘాటించారు.

## సంగారెడ్డి జిల్లా వద్ద అదుపుతప్పిన బస్సు

### బ్రేకులు ఫెయిల్ అయి విద్యుత్ స్తంభానికి ఢీ

### ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులు



**సంగారెడ్డి, నవంబర్ 5:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటన ఎంతటి విషాదాన్ని నింపిందో అందరికీ తెలిసిందే. బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అందులోని కంకర బస్సులో పడి దాదాపు 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. అయితే ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. ముందు ఉన్న కారును తప్పించబోయి బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు మేడ్చల్ డిపోకు చెందింది. మేడ్చల్ నుంచి ఇస్నాపూర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. అయితే ఆర్టీసీ బస్సులకు వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి.




సంపాదకీయం

# అభినందనలు కాదు.. ప్రోత్సాహం కావాలి!

మనదేశంలో క్రీడల్లో గెలిచాకనే అభినందనలు, ప్రశంసలు వెల్లువెత్తుతాయి. కానీ ఆడుకోవడానికి పాఠశాల స్థాయిలో లేదా కాలేజీ స్థాయిలో ప్రోత్సాహం మాత్రం అంతంత మాత్రమే. ఏ ప్రభుత్వం వచ్చినా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం అంటుందే తప్ప..ఆచరించి చూపడం లేదు. ఈ విధానం మారలి. క్రీడలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలి. ఆర్థికంగా వారికి అండగా నిలవాలి. క్రీడ ఏదైనా నేర్చుకునేం దుకు అవసరమైన వసతులు కల్పించాలి. అప్పుడే భారత్ ప్రపంచస్థాయిలో సగర్వంగా నిలబడగలుగు తుంది. క్రీడాకరులు అందుకు సిద్దంగా ఉన్నారు. ఇటీవలి మహిళా క్రికెట్ కప్ విజేతల ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. ఇందులో ఆడిన వారంతా దేశం కోసం చెమటోడ్చారు. తాము పడ్డ కష్టాన్ని మరచిపోయి, దేశ కీర్తిపతాకను రెపరెపలాడించారు. ఈ క్రమంలో ఐదు దశాబ్దాల కలను భారత మహిళలు సాకారం చేశారు. ఆకాశమే హద్దుగా అద్భుత ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. అడ్డంకులన్నీ అధిగమించి, బలమైన దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగులతో ఓడించడం ద్వారా భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించింది. దీంతో దేశం గర్వించింది. అయితే దీని వెనక ఒక్కో అమ్మాయి వ్యథాభరిత జీవితం ఉంది. క్రికెట్‌లో తాము రాణించడానికి వ్యక్తిగతం గా ఎంతో శ్రమించారు. ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. 1973లో మనదేశంలో మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ పోటీల్లో భారత మహిళల ప్రస్థానం మొదలైంది. తొలితరం క్రికెటర్లు సొంత బ్యాటు, కిట్టు లేకపోయినా, జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ సొంత డబ్బులపైనో, చందాల పైనో ఆధారపడి దేశం తరపున ఆడారు. ఆ తరువాత స్పాన్సర్లు ముందుకు రావడం, 2005లో బిసిసిఐ పరిధిలోకి రావడం జరిగాయి. 2022లో పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని, మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టడం,అంతర్జాతీయ క్రికెటర్లతో ఆడే అవకాశం లభించడం, ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రావడం వంటి పరిణామాలతో మహిళల క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లాయి. ఈ క్రమంలో వారు ఎదుర్కొన్న కష్టనష్టాలు అన్నీ దేశం కోసమే అని చెప్పక తప్పదు. తమ వ్యక్తిగత ప్రతిష్ట కోసమో లేదా డబ్బు సంపాదన కోసమో వారు ఆడలేదు. వారు భారత పతకాను ఎగరేయడం వెనక ఉన్న కష్టాలను తెలుసుకుని ప్రోత్సాహనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాలి. అవసరమైతే కేంద్రమే క్రీడలకు సంబంధించి ప్రోత్సాహక కమిటీని ఏర్పాటు చేసి ఇలాంటి కష్టాలను అధిగమించేలా చేయాలి. ఇకపోతే వరుసగా రెండుసార్లు అండర్- 19 అమ్మాయిల జట్టు ప్రపంచకప్ నెగ్గడం, తాజాగా సీనియర్ జట్టు విజయం సాధించడం మహిళా క్రికెట్‌లో ఉజ్వల భవితకు పునాది. ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాలతో డీలాపడిన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో అమోల్ మజుందార్ కోచ్‌గా, మెంటార్‌గా అందించిన ప్రోత్సాహం ఆటగాళ్లలో మానసిక దృఢత్వాన్ని తీసుకొచ్చింది. వన్డే ప్రపంచకప్ టైటిల్ కొట్టడంలో ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో.. తెర వెనుక కోచ్ పాత్ర అంతకుమించి ఉంటుంది. ఈ విజయంలో అతనిదీ ప్రత్యేక పాత్ర అని చెప్పక తప్పదు. మజుందార్ దేశవాళీ క్రికెట్ ఆడే క్రమంలో భారత క్రికెట్ జట్టులో మరో సచిన్ అవుతాడని భావించారు. దేశవాళీ క్రికెట్లో ముంబయి తరఫున పరుగుల వరద పారించాడు. 'ది వాల్'గా పేరు తెచ్చు కున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచుల్లో 11,167పరుగులు చేశాడు. ఇందులో 30సెంచరీల, 60అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇక 113 లిస్ట్-ఎ క్రికెట్ మ్యాచుల్లో 3,286 పరుగులు కొట్టా డు. 3సెంచరీలు, 26అర్ధసెంచరీలు చేశాడు. కానీ ఆయనకు ఒక్కసారి కూడా టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కలేదు. అయినా నిరుత్సాహానికి గురికాలేదు. భారత మహిళలజట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక తన పూర్వ వైభవాన్ని రంగరించి క్రీడాకారిణులను మెరికల్లా తీర్చిదిద్దాడు. దీంతో భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ గెలవడంలో కోచ్‌గా కీలక పాత్ర పోషించాడు. కడపజిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల నల్లపురెడ్డి శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా 9 మ్యాచ్‌లు ఆడి, 14 వికెట్లు తీయడం ద్వారా ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లుసైతం ఆమె బౌలింగ్‌ను ఎదుర్కోవ డానికి ఆపసోపాలు పడటం ఆమె నైపుణ్యానికి నిదర్శనం. 22 వికెట్లతో మన దేశానికే చెందిన దీప్తిశర్మ మొదటిస్థానాన్ని దక్కించుకుని, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకుంది. అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా వైస్ కెప్టెన్ స్మృతి మందాన నిలిచింది. గ్రూప్ దశలో బ్యాటింగ్‌లో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బౌలింగ్‌లో దీప్తి శర్మ, క్రాంతిగౌడ్, రేణుకాసింగ్ సత్తా చాటారు. ఫైనల్స్ లో షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో, హర్మన్ ప్రీత్‌కౌర్ కెప్టెన్సీ ఇలా అందరి సమిష్టి కృషే జగజ్జేతగా నిలిపింది. జట్టులోని చాలామంది దిగువ మధ్యతరగతివారే. శ్రీచరణి తండ్రి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో చిన్న ఉద్యోగి. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ ఎదిగారు. మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కుమార్తె క్రాంతిగౌడ్, తన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలు పెట్టిన అమన్‌జోత్ లాంటి వారంతా అనేక కష్టాలను ఎదురొడ్డి నిలిచిన వారే. ఇన్ని కష్టాల మధ్య కుటుంబ సభ్యులు, కోచ్‌లు లేదా ఇంకెవరైనా ప్రోత్సాహంతో రాణిస్తున్నారే తప్ప ప్రభుత్వ తోడ్పాటు, ప్రోత్సాహం కరువవుతున్నాయి. క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, క్రీడాకారులు రాణించడానికి కావలసిన ప్రోత్సాహం ప్రభుత్వాల నుంచి రావాలి. వారిని రంగం మీద నిలిపి గెలుపుగుర్రాలుగా మలచాలి.

# కెనడాలోనూ తిరోగమన చర్యలు

- భారతీయులకు తాత్కాలిక వీసాల రద్దు
- విద్యార్థులకు కూడా భారీగా కోత విధింపు



**న్యూఢిల్లీ, నవంబర్ 5:** భారతీయులకు జారీచేసిన తాత్కాలిక వీసాలను మూకుమ్మడిగా రద్దు చేయాలని కెనడా ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అమెరికా తరవాత అంతో ఇంతో ఆశగా ఉన్న కెనడాలో సైతం ఈ మధ్యజాత్యహంకారం పెరగింది. దీంతో పార్లమెంట్ ఆమోదం కోసం ఎదురుచూస్తున్న ఓ బిల్లు ప్రకారం కొవిడ్-19 వంటి మహమ్మారి లేదా యుద్ధ సమయాలలో విదేశీయులకు మంజూరు చేసే తాత్కాలిక వీసాలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే కెనడా ప్రభుత్వం మాత్రం ప్రత్యేకించి కొన్ని దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ అధికారాలను ప్రయోగించాలని భావిస్తున్నట్లు సీబీసీ న్యూస్ వెల్లడించింది. విధానంలోని లోపాలను ఉపయోగించుకుని మోసపూరితంగా తాత్కాలిక వీసాలు పొందకుండా అడ్డుకునే అధికారాలను కూడా ఈ బిల్లులో పొందుపరచాలని కెనడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ), కెనడియన్ బార్డర్ సర్వీసెస్ ఏజెన్సీస్(సీబీఎస్‌ఏ) నివేదికలను ఉటంకిస్తూ సీబీసీ తెలిపింది. కెనడా ప్రభుత్వం ప్రత్యేకంగా భారత్, బంగ్లాదేశ్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొంది. తాత్కాలిక నివాసులలో ఉద్యోగులు, అంతర్జాతీయ విద్యార్థులతోపాటు సందర్శకులు కూడా ఉంటారు. కెనడా సరిహద్దులను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంట్‌కు సమర్పించింది. సంబంధిత మంత్రికి అపారమైన అధికారాలను కట్టబెట్టే స్టాం÷-రగ్ బార్డర్స్ బిల్లుకు లిబరల్ ప్రభుత్వం ఆమోదించిన పక్షంలో వీసా దరఖాస్తులు భారీ స్థాయిలో రద్దయ్యే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ న్యాయవాది సుమిత్ సేన్ గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వత, తాత్కాలిక వలసలకు అడ్డుకట్ట వేయాలని కెనడా ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం కోసం వేచి ఉంది. కెనడా కళాశాలల్లో చదువుకునేందుకు పర్మిట్ల కోసం వచ్చిన భారతీయ దరఖాస్తులలో దాదాపు 74 శాతం దరఖాస్తులు ఈ ఏడాది ఆగస్టులో తిరస్కరణకు గురైనట్లు రాయిటర్స్ వెల్లడించింది. దశాబ్ద కాలంగా కెనడాలో చదివే అంతర్జాతీయ విద్యార్థులలో అత్యధికులు భారతీయులే ఉంటున్నారు. అయితే ఈ ఏడాది ఆగస్టులో వీసా దరఖాస్తుల తిరస్కరణకు గురైన విద్యార్థులలో కూడా భారతీయులే అత్యధికంగా ఉండడం గమనార్హం. 2023 ఆగస్టులో సుమారు 32 శాతం దరఖాస్తులు మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. కెనడా ప్రభుత్వం ఈ నెలలోనే తన ఇమిగ్రేషన్ ప్రణాళికను వెల్లడించనున్నది. దేశంలోకి విదేశీయుల ప్రవేశాన్ని తగ్గించాలని ప్రభుత్వంపై దేశీయంగా ఒత్తిడి పెరుగుతున్నది. జారీ అయిన తాత్కాలిక వీసాలను మూకుమ్మడిగా రద్దు చేసేందుకు ప్రభుత్వానికి అధికారాలు కట్టబెట్టే బిల్లుపై 300కి పైగా పౌర సంఘాలు తీవ్ర నిరసన తెలియచేశాయి. మూకుమ్మడిగా వీసాలను రద్దు చేయడం ద్వారా కెనడా ప్రభుత్వానికి దేశంలో ఉంటున్న విదేశీయులందరినీ ఇక్కడి నుంచి తరలించే అధికారాలు లభిస్తాయని ఆ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మూకుమ్మడిగా వీసాలను రద్దు చేసే అధికారాన్ని పొందడం ద్వారా ప్రభుత్వం పెరిగి పోతున్న పెండింగ్ వీసా దరఖాస్తుల సంఖ్యను తగ్గించాలని భావిస్తోందని ఇమిగ్రేషన్ న్యాయవాదులను ఉటంకిస్తూ బీబీసీ తెలిపింది. ఆశ్రయం కోరుతూ భారతీయులు సమర్పిస్తున్న దరఖాస్తులు భారీగా పెరిగిపోవడమే భారతీయులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. 2023 మేలో కేవలం నెలకు 500 లోపలే ఈ దరఖాస్తుల సంఖ్య ఉండగా 2024 జూలైలో ఇది దాదాపు 2,000కి పెరిగిపోయింది. భారత్ నుంచి వచ్చే తాత్కాలిక వీసా దరఖాస్తులను తనిఖీ చేయడం వల్లే దరఖాస్తుల ప్రాసెసింగ్ కుంటుపడుతున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. 2023 జూలై చివరి నాటికి వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్ సగటు సమయం 30 రోజులు ఉండగా మరుసటి సంవత్సరానికి అది 54 రోజులకు పెరిగింది. ఈ కారణంగా వీసా ఆమోదాలు 2024లోనే బాగా తగ్గిపోయాయి. జనవరిలో 63 వేల దరఖాస్తులను ఆమోదించగా జూన్‌లో అది 48 వేలకు పడిపోయింది.

# బీహార్‌లో ఎన్డీయే కూటమిదే విజయం

**మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు**

**ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ**




**న్యూఢిల్లీ, నవంబర్ 5:** బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బిహార్లో తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ప్రతిచోటా మునుపటి సభ కంటే భారీగా ప్రజలు వస్తున్నారని, ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. బిహార్‌లో భాజపా-ఎన్డీయే మహిళా కార్యకర్తల్ని ఉద్దేశించి మంగళవారం ఆయన నమో యాప్ ద్వారా ప్రసంగించారు. 'మేరే బూత్.. సబ్‌సే మజ్‌బూత్' అనే సంకల్పంతో భాజపా మహిళా కార్యకర్తలు అమోఘమైన కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. బిహార్ ఎన్నికలను నేనెంతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాను. అందువల్ల ఎన్డీయేదే గెలుపు అని ఖాయంగా చెప్పగలను. విజయంపై నాకెలాంటి సందేహం లేదు. పోలింగ్ మాత్రం ఇంకా పెరగాలని కోరుకుంటున్నాను. మహిళల సులభతర జీవనాన్ని మెరుగుపరడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్డీయే విజయం కోసం బిహార్ ప్రజలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని చెప్పిన ఓ మహిళతో మోదీ మాట్లాడుతూ- పేదలు, దళితులు, మహా దళితులు, బీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాల్లోనూ ఇదే భావన ఉందని అన్నారు.

# యూపీలో పట్టాలు దాటుతుండగా ఘోరం

**రైలు ఢీకొని నలుగురు యాత్రికుల దుర్మరణం**

**లక్నో, నవంబర్ 5:** ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మిర్జాపుర్‌లో బుధవారం రైల్వే పట్టాలు దాటుతున్న యాత్రికులను ఓ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందినట్లు తెలుస్తోంది. కార్తిక పౌర్ణమి నేపథ్యంలో యాత్రికులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాత్రికులు చోపాన్-ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలులో చునార్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వారు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం పైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ట్రాక్ పైకి వచ్చిన హౌరా-కల్కా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు.





# తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

**నదీతీరాల్లో పుణ్యస్నానాలు ● ఆలయాల్లో శైవరాధన..కార్తీక దీపాల వెలిగింపు**



**హైదరాబాద్/విజయవాడ,నవంబర్ 5:** తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరించారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి, కృష్ణానదుల్లో స్నానం చేయడంతో పాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెలకొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేసారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. యాదాద్రి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ కనిపించింది. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారుమోగాయి. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసారు. ధర్మపురి,బాసర, కాళేశ్వరంల వద్ద గోదావరి స్నానాలకు భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం ఆలాయాల్లో దీపారాధాన చేపట్టారు.

# టెక్నాలజీయే మన శక్తి

మొదటి పేజీ తరువాయి


నాయుడు ఉద్ఘాటించారు. లండన్‌లోని ప్రతిష్ఠాత్మక 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్' (ఐవోడీ) పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన, తన ప్రభుత్వ విజన్‌ను, భవిష్యత్ కార్యాచరణను ఆవిష్కరించారు.

**గత అనుభవమే భవిష్యత్తుకు మార్గదర్శి**

1990లలో ఐటీ రంగం భవిష్యత్తుపై అనేక సందేహాలున్నప్పటికీ, హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు బిల్ గేట్స్‌ను ఒప్పించగలిగానని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆనాడు వేసిన బీజాలే ఈనాడు ప్రపంచ ఐటీ రంగంలో తెలుగువారిని కీలక స్థానంలో నిలబెట్టాయి. ఆ దూరదృష్టితోనే నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాధాన్యాన్ని గుర్తించాం. దీని ఫలితంగానే, అమెరికా బయట గూగుల్ తన అతిపెద్ద ఏఐ కేంద్రాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తోంది" అని ఆయన వివరించారు. భౌగోళిక రాజకీయ మార్పులు, వాతావరణ సంక్షోభం వంటి సవాళ్లను ఎదుర్కోవాలంటే పక్కా ప్రణాళిక, విజన్ తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజల కోసమే టెక్నాలజీ**

టెక్నాలజీని కేవలం అభివృద్ధి కోసమే కాకుండా, ప్రజలకు సేవలను మరింత చేరువ చేయడానికి, వారిని ఆపదల నుంచి కాపాడటానికి వినియోగిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ఇటీవల రాష్ట్రాన్ని తాకిన 'మొంథా' తుపాను సమయంలో టెక్నాలజీ ఆధారిత రియల్-టైమ్ గవర్నెన్స్ ద్వారా కచ్చితమైన అంచనాలు వేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. పాలనలో పారదర్శకత పెంచేందుకు, ప్రజలకు సేవలను సులభతరం చేసేందుకు 700కు పైగా సేవలను నేరుగా వాట్సాప్ ద్వారానే అందిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.



**పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్**

వ్యాపార నిర్వహణలో వేగానికి ప్రాధాన్యమిస్తూ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు అన్నారు. ఈ విధానాల ఫలితంగానే కేవలం ఏడాది కాలంలోనే ఆంధ్రప్రదేశ్ 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించిందని వెల్లడించారు. భారత్-యూకే మధ్య వాణిజ్య బంధం బలపడుతోందని, ఇది ఇరు దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్ తన 100వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న విశ్వాసం నాకుంది" అని ఆయన అన్నారు.

వాతావరణ మార్పులు ప్రపంచానికి అతిపెద్ద సవాలని, 'వసుధైక కుటుంబం' స్ఫూర్తితో దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేసి భవిష్యత్ తరాలకు మంచి ప్రపంచాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, పురస్కారాలు అందుకున్న తన సతీమణి నారా భువనేశ్వరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## గవర్నర్ జస్టిస్ నజీర్‌కు లా డాక్టరేట్

**అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి :** కర్ణాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రతిష్టాత్మక డాక్టర్ ఆఫ్ లాస్ డిగ్రీని అందుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ గౌరవం.. చట్టం, న్యాయం, ప్రజాసేవలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన కృషిని ప్రతిబింబిస్తోందన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను సీఎం చంద్రబాబు అభినందనలతో ముంచెత్తారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ ఎక్స్ ఖాతాకు గవర్నర్ ఏపీ అంటూ ట్యాగ్ చేసి.. ఈ పోస్ట్ చేశారు. బుధవారం హుబ్లీలోని నవనగర్‌లో కర్ణాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం.. ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఆ రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ చేతుల మీదగా డాక్టర్ ఆఫ్ లాస్ డిగ్రీని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు యూనివర్శిటీ అధికారులు పాల్గొన్నారు. గతంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ అబ్దుల్ నజీర్ పని చేశారు. ఆ పదవి నుంచి రిటైర్ అయిన తర్వాత ఏపీ గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్ బాధ్యతలు చేపట్టారు.

## ఖరీఫ్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

మొదటి పేజీ తరువాయి



సిద్ధం అయినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమైన సంస్కరణ చేశామని.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో రైతులను ఆదుకోవాలని నిర్ణయించామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనేక సందర్భాల్లో ఏ విధంగా దళారులను ప్రోత్సహించినా పరిస్థితులను మార్చేందుకు కృషి చేశామన్నారు. రైతులతో మాట్లాడి ఈ పరిస్థితుల్లో మార్పులు తెచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. తేమ శాతంలో పారదర్శకత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను.. 6 కోట్ల గోతాలను కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం కొన్ని సందర్భాలలో 6 నెలలు నుంచి 9 నెలల వరకు బకాయిలు ఇవ్వలేదని గుర్తుచేశారు. దాదాపు రూ.1670 కోట్ల బకాయిలు గత ప్రభుత్వం వదిలి వెళ్ళిందని విమర్శించారు. దాదాపు 87 శాతం ధాన్యం కొనుగోలు డబ్బులు 48 గంటల్లో ఇచ్చామని తెలిపారు. ఈ సారి 24 గంటల్లోనే పేమెంట్ చేసేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఉదయం, 12 గంటలకు, 2 గంటలకు, 4 గంటలకు, 7 గంటలకు ధాన్యం అమ్మినా రోజు వారికి పేమెంట్ చేస్తున్నామని.. అంటే కేవలం 2 గంటల్లోనే డబ్బు చెల్లిస్తామన్నారు. సెలవు రోజుల్లో మాత్రం తదుపరి రోజు చెల్లిస్తామని మంత్రి చెప్పారు. మాయిశ్చర్ రీడింగ్ విషయంలో బ్లూ టూత్ ద్వారా లెక్కించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సప్ ద్వారా ధాన్యం కొనుగోలుకు అవకాశం ఇస్తున్నామని... ఈ సీజన్‌లో రైతులు ఇప్పటికే ఈ సౌలభ్యాన్ని వాడుతున్నారని మంత్రి తెలిపారు. నవంబర్‌లో 11 లక్షలు, డిసెంబర్‌లో 25 లక్షలు, జనవరిలో 8 లక్షలు, ఫిబ్రవరిలో 3 లక్షలు, మార్చిలో మరో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధం అవుతున్నట్లు వెల్లడించారు. జనవరి నుంచి జిల్లా హెడ్ క్వార్టర్‌లలో గోధుమ కేజీ 18 రూపాయలకు అందించాలని చూస్తున్నట్లు తెలిపారు. దీపం 2 పథకం విషయంలో నవంబర్ 30 వరకు 3వ విడత కొనసాగుతుందని స్పష్టం చేశారు. మొంథా తుఫాను బాధితులకు పౌరసరఫరాల శాఖ నిత్యావసరాలు అందించిందన్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డులు 92 శాతం పంపిణీ పూర్తి అయిందని అన్నారు. నెలాఖరున మిగిలిన కార్డులు వెనక్కి తీసుకుని... మనమిత్ర యాప్ ద్వారా కోరిన వారికి పరిశీలించి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కౌలు రైతులకు 50 వేలు టారపాలిన్‌లు ఉచితంగా అందిస్తామని మంత్రి అన్నారు. చాలా జిల్లాల్లో ఈ క్రాప్ పూర్తి అయిందని.. అసలు గతంలో వారు ఎంతమంది దగ్గర నుంచి కొనుగోలు చేశారో ఆ పార్టీ నేత చెప్పాలని డిమాండ్ చేశారు. 39 లక్షల 51 వేల ఎకరాలు ధాన్యం కొనుగోలు ఈ క్రాప్ కింద నమోదు అయినట్లు తెలిపారు. 85 లక్షల మెట్రిక్ టన్నులు క్రాప్ వస్తుందని భావిస్తున్నామన్నారు. పంట నష్టం నమోదు చేసి అందించినప్పుడు ధాన్యం కొనుగోలు చేయరని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నూటికి నూరు శాతం ఈ క్రాప్‌లో నమోదు అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. తమవి కాని ఆస్తులు రేషన్ కార్డు జారీలో చూపిస్తున్న మాట నిజమే అని అదంతా లెగసీ వల్ల వచ్చిందని.. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కందిపప్పు విషయంలో ప్రైస్ ఇంటర్వెన్షన్ అవసరం లేదని భావిస్తున్నామన్నారు. గోధుమ 1 కేజీ కుటుంబానికి ఇచ్చే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పీడీఎస్ రైస్ విషయంలో 5 నిముషాల్లో నిర్ధారణ చేసి సీజ్ చేసే అవకాశం ఉంటుందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

## బాలకృష్ణ స్పీచ్ విన్నాక అసెంబ్లీకి వెళ్లడం అవసరమా?

మొదటి పేజీ తరువాయి



చేస్తున్నాం అన్నారు.. ఇక, సభకు రాని ఎమ్మెల్యేల మీద చర్యలు తీసుకుంటామని చెబుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. ఎందుకు ఆ పని చేయడం లేదు..? అని ప్రశ్నించారు. డేటా సెంటర్ల విషయంలో మా విధానం మొదటి నుంచి క్లియర్ అన్నారు ఎమ్మెల్సీ బొత్స.. రామ్మోహన్ నాయుడుకి భోగాపురం ఎయిర్ పోర్టు అంశం కోతికి కొబ్బరికాయ దొరికినట్టు దొరికింది.. రోజూ ఎయిర్ పోర్టుకు వెళ్లి పరిశీలించి వస్తున్నట్టు ఫోటోలు వస్తున్నాయి.. అదేమైన ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మిస్తుందా అని ప్రశ్నించారు.. ఎయిర్ పోర్ట్ విజిట్‌లు తగ్గించి అప్రోచ్ రోడ్లు, 6 లైన్స్ రోడ్స్ నిర్మాణం పూర్తి చేయడంపై దృష్టి సారించండి అని సలహా ఇచ్చారు.. విశాఖ పెట్టుబడిదారుల సదస్సుకు వచ్చే వాళ్లకు రుషికొండలో హోస్ట్ చేయమని నా సూచన? రుషికొండలో బిల్డింగ్ పెచ్చులు ఊడిపోవడం అంశం సీజ్ ది షిప్ లాంటిదే అంటూ ఎద్దేవా చేశారు బొత్స సత్యనారాయణ.. మరోవైపు, మొంథా తుఫాన్ వల్ల జరిగిన పంట నష్టంపై స్పందించిన ఎమ్మెల్సీ బొత్స.. ఇన్సూరెన్స్ లను ప్రభుత్వం చెల్లించి ఉంటే రైతుకు నూటికి నూరు శాతం నష్టం భర్తీ అయ్యేది.. ఈ క్రాప్ విధానం రద్దు చేసి రైతులనే ఇన్సూరెన్స్ కట్టుకో మని వదిలేయడంతో ఎక్కువ మంది నష్టపోతున్నారు అని తెలిపారు.. వైసీపీ హయాంలో రైతుల తరపున ప్రతీ పైసా ఇన్సూరెన్స్ మేం చెల్లించాం.. వైసీపీ హయాంలో 7 వేల కోట్లు మద్దతు ధర రూపంలో చెల్లించాం.. ఈ ప్రభుత్వంలో ఆ విధానం ఎక్కడైనా అమలైందా..? అని ప్రశ్నించారు బొత్స.. ఇక, అక్రమ మద్యం కేసులో జోగి రమేష్ పై నన్ను అడిగితే సంబంధం లేదనే చెబుతాను.. ఒక వర్గం మీడియా కట్టు కథనాలుగానే భావిస్తున్నాను.. వైజాగ్ డ్రగ్స్ మీద మొదటి నుంచి నా విధానం క్లియర్.. మూడు సార్లు ఈ అంశంపై నేను మాట్లాడాను, సీబీఐకి, హోం శాఖకు లేఖలు కూడా రాశాను.. ప్రభుత్వ వైఫల్యం బయటపడిన ప్రతీసారి డైవర్ట్ చేసే ప్రయత్నం చేయడం అలవాటుగా మారిందని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు.

## పర్యాటకంగా మంగినపూడి అభివృద్ధి

**సముద్రతీరంలో సాగరహారతి పట్టిన మంత్రి**

**విజయవాడ :** కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో భక్తులు సముద్ర స్నానాలు చేసారు. సాగర సుప్రభాత హారతితో మంత్రి కొల్లు రవీంద్ర సముద్ర స్నానాలను ప్రారంభించారు. ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో సముద్రునికి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర పవిత్ర సముద్ర స్నానం ఆచరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... సముద్ర స్నానాలకు విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. లక్ష మంది పైబడి భక్తులు వస్తారని అంచనా వేసామని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సాగర హారతితో ఓ చక్కటి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టామన్నారు. తీర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు నదీ స్నానాలు చేసి శివయ్యను దర్శించుకున్నారు. మహిళలు దీపాలకు వెలిగించి నదిలో వదులుతూ నదీ పూజలు చేస్తున్నారు. రాష్ట్రంలోని శివాలయాలు అన్నీ భక్తులతో కిటకిట లాడాయి. హర హర మహాదేవ శంభో శంకర అంటూ ఆ దేవదేవుడిని స్మరించుకుంటున్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలి



మొదటి పేజీ తరువాయి

వివరించారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో అవనిగడ్డ పరిధిలో అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల పునరుద్ధరణ చేసినట్లు తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పుకొచ్చారు. అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిన అభివృద్ధి పనులకూ మోక్షం లభించనుందని తెలిపారు. మొంథా తుఫానులో నష్టపోయిన కౌలు రైతుల వివరాలతో వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులకి పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తోంది. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. నిధులు పొందడంలో, వాటిని వినియోగించే పక్రియలో సీఎం చంద్రబాబు తగిన సూచనలు అందిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలన్న కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు..

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**శ్రీకాకుళం విమెన్స్ కాలేజీలో అదనపు గదులకు ప్రారంభం**

**విద్యార్థులతో ముచ్చటించిన కేంద్రమంత్రి రామ్మోహన్**



**శ్రీకాకుళం :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు. అందుకు వారికి తన సహకారం ఉంటుందని అన్నారు. బుధవారం శ్రీకాకుళం పట్టణంలో ఉమెన్స్ కళాశాలలో అదనపు భవనాల ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో తన తల్లి కూడా చదివారని తెలిపారు. స్టేట్‌లో అధికంగా ఈ మహిళా కళాశాలలో విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. రూ. 99 లక్షలతో 5 అదనపు తరగతి గదులు నిర్మించామని తెలిపారు. పిల్లల మైండ్ అభివృద్ధి చెందాలంటే అందరూ ఆటలు ఆడాలని కేంద్రమంత్రి అన్నారు. కళాశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పిల్లల నుంచి కోరుకునేది ఒక్కటే అని.. యూత్ అంతా రాణించాలని ఆకాంక్షించారు. పిల్లలంతా పెద్ద పెద్ద లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. పిల్లలంతా చదువు సమయంలో చదువు పైనే దృష్టి పెట్టాలని సూచించారు. వేదిక ఎదురుగా విద్యార్థులతో కలిసి నేలపైన కూర్చుని మరీ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ముచ్చటించారు. అనంతరం కల్లేపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. కోతకు గురైన పెద్ద గనగళ్లవానిపేట వద్ద సముద్ర తీరాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పరిశీలించారు.

## పరిశ్రమలతో యూనివర్సిటీల అనుసంధానం



మొదటి పేజీ తరువాయి

లోకేష్. ఉన్నత విద్యలో పాఠ్యప్రణాళిక ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐటీఐలు, యూనివర్సిటీలను నవంబరులోగా పరిశ్రమలతో అనుసంధానిం చాలని సూచించారు. కేజీ నుంచి పీజీ వరకు స్టూడెంట్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా రూపొందించాలని ఆజ్ఞాపించారు. యూనివర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో వందశాతం ప్రాంగణ నియామకాలకు చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశర చేశారు మంత్రి లోకేష్. ఈ నెల 27వ తేదీన సింగపూర్‌కు ఉత్తమ ఉపాధ్యాయులు వెళ్తారని స్పష్టం చేశారు. డిసెంబర్ 5వ తేదీన మెగా పీటీఎంకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పాఠశాలల్లో పరిశీలనకు డీఈఓలు, ఎంఈఓలు క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందేనని మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు

## జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి

హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై మంత్రులు మాట్లాడారు. జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు జీవోఎం ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే జీఎంవో ప్రాథమికంగా ఇచ్చిన నివేదికపై కొన్ని మార్గదర్శకాలు సీఎం చంద్రబాబు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని ఇప్పటికే జీఎంవో నిర్ణయించింది. మంత్రుల బృందం సమావేశంలో చర్చించిన అంవాలతో తుది నివేదికను రూపొందించి సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉప సంఘం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే నివేదిక ఇచ్చేందుకు జీవోఎం ప్రయత్నిస్తోంది. ఈ నెల 10వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కీలక చర్చలు జరిపి మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి

## బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ మధుసూదన్ రెడ్డి ని పరామర్శించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి.



**కొడంగల్ మున్సిపల్ (మం)నవంబర్,05(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ మధుసూదన్ రెడ్డి అనారోగ్యంతో హైద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బుధవారం ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించరూ.అనంతరం మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తో పాటు దౌల్తాబాద్ మండల మాజీ జెడ్పిటిసి కోట్ల మైపాల్ తదితరులు ఉన్నారు.

## వక్ఫ్ ఆస్తుల్ని ఉమ్మిద పోర్టల్ లో నమోదు చేసుకోండి

- జే ఐ హెచ్ రాష్ట్ర కార్య దర్శి ఉస్మాన్



**ఖమ్మం, నవంబర్5 : ( సమయం న్యూస్ )** మైనారిటీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఉమిద పోర్టల్ లో వక్ఫ్ ఆస్తుల్ని డిసెంబర్ 5వ తారీఖుకు ముందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉస్మాన్ పిలుపునిచ్చారు. మంగళవారం జమాతే ఇస్లామి హింద్ ఖమ్మం నగర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వక్ఫ్ చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన ఆధీనంలో ఉన్న మసీదులు ,దర్గాలు ,స్మశాన వాటికలు, మదర్సాలు , వక్ఫ్ కు చెందిన ఇతర ఆస్తులను తగిన పత్రాలతో సమర్పించాలని తెలిపారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే ఖమ్మం జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ ఫయాజుద్దీన్ ని సంప్రదించాలని కోరారు .ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నార్త్, సౌత్, ఈస్ట్ బాధ్యులు యూసుఫ్ షరీఫ్ నిజాముద్దీన్,అబ్దుల్ సుబూర్,కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్ ఖాన్, షరీఫ్, పట్టణ అధ్యక్షులు జహంగీర్ షరీఫ్ మరియు వివిధ మసీదు కమిటీల బాధ్యులు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు

## 7న జాబ్ మేళా నిర్వహణ

- జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్

**ఖమ్మం, నవంబర్5: ( సమయం న్యూస్ ) :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం భారత్ హ్యుండాయ్ ప్రై. లిమిటెడ్ (ఖమ్మం ) సేల్స్ కన్సల్టెంట్స్(మేల్)-22, సర్వీస్ అడ్వయిజర్- 2 ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 7న శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి బి ఖమ్మం )జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం లలో పని చేసే విధంగా సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్) పోస్టుకు ఏదేని డిగ్రీ, టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ గల 22 నుండి 30 వయస్సు కలిగిన యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 18 వేల రూపాయలు ఉంటుందని అన్నారు.సర్వీస్ అడ్వయిజర్ ఉద్యోగాల ఖాళీలకు డీజిల్ మెకానిక్/ బిటెక్ మెకానిక్ అర్హత గల 22 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 12 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు.మొత్తం 24 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు అర్హత గల యువతీ, యువకులు హాజరు కావాలని, ఇతర వివరాలకు 7036902902 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రోడ్డును మరమ్మతు చేయించండి

- బిజెపి గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్





**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 5 :** ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ వెళ్లే రహదారి నిత్యం రద్దీగా ఉండే రోడ్డు విజయవాడ నుండి ముంబాయి వైపు వెళ్లే పెద్ద వాహనాలు,అనేక స్కూల్ బస్సులు,ఉద్యోగులు గజ్వేల్ చుట్టూ ప్రాంతాల నుండి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ప్రయాణం చేస్తుంటారు,గత కొన్ని నెలలుగా కురుస్తున్న వర్షాల వలన ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది కాబట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు,నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నరు.ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి ప్రజలకు ప్రమాదాలనుండి ఉపశమనం కలిగించాలని కోరుతున్నారులేని పక్షంలో బీజేపీ పక్షాన భిక్షాటన చేసి రోడ్డు మరమత్తులు చేపడతాం అని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్ తెలియజేశారు

# వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చరిత్రను విస్మరించడం తగదు

- ఎస్సారెస్పీ రెండవ దశకు బిఎన్ రెడ్డి పేరు పెట్టాలని ఈనెల 19న ఇందిరా పార్క్ వద్ద ధర్నా
- ప్రచార కరపత్రాలను ఆవిష్కరించిన రైతు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు



**వరంగల్ నవంబర్ 5. (సమయం న్యూస్) :** తెలంగాణ ప్రజల విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటానికి నడుం బిగించి సర్వం త్యాగం చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యోధుల చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం సరైనది కాదని తక్షణమే ఎస్సారెస్పీ రెండవ దశ కాలువకు కామ్రేడ్ బి.ఎన్.రెడ్డి పేరు పెట్టాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) జాతీయ ఉపాధ్యక్షులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గోనె కుమార స్వామి హెచ్చరించారు. ఈరోజు ఏఐకేఎఫ్, ఏ ఐ ఏ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి గారి పేరును శ్రీరామ్ సాగర్ రెండవ దశకు నామకరణం చేయాలని, సూర్యాపేట జిల్లా బి.యన్.రెడ్డి జిల్లాగా మార్చాలని, ట్యాంక్ బండ్ పై బి.యన్.రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన ధర్నా ప్రచార కరపత్రాలను హైదరాబాదులోని ఓంకార్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు నైజాం రజాకార్ల చేతిలో బంది అయిన తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేసి భూమి బుక్తి కై సాయుధ పోరాటానికి నాంది పలికి నాయకత్వం వహించిన పోరాటయోధుల చరిత్రను స్ఫూర్తి కలిగే విధంగా చరిత్ర పుటల్లో లిఖించి వారి ఆదర్శాలను త్యాగాలను పోరాట గాథలను గుర్తించుకునే విధంగా చేయాల్సిన పాలకులు చరిత్రను వక్రీకరించే చర్యలకు పూనుకోవడం దారుణం అన్నారు. అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఆది నుంచి అంతం వరకు ముందుండి నడిపించిన గొప్ప యోధుడు అని ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రజలకు సాగు త్రాగు నీటి కోసం ఎస్సారెస్పీ జలాల సాధన కోసం ఎంతో పరితపించి అప్పటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి సాధించాడని అలాంటి వీరుల త్యాగాలు ఆదర్శాలు నేటి సమాజానికి ఎంతో అవసరమైనప్పటికీ ప్రభుత్వాలు గుర్తించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులకు యోధులకు చరిత్రలో ప్రత్యేక గుర్తింపు కలిగించే విధంగా భవిష్యత్తు తరాలకు చరిత్రను అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా కామ్రేడ్ బి ఎన్ రెడ్డి పేరును ఎస్సారెస్పీ రెండవ దశకు నామకరణం చేయాలని సూర్యాపేట జిల్లాకు బి ఎన్ రెడ్డి జిల్లాగా మార్చాలని ట్యాంక్ బండ్ పై కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టినట్టు వామపక్ష ప్రజాసంఘాల రాష్ట్ర నేతలను ఆహ్వానిస్తున్నట్లు ప్రజల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమరజీవి భీమిరెడ్డి నరసింహారెడ్డి కుమారుడు ప్రభాకర్ రెడ్డి అల్లుడు మల్లు కపోతం రెడ్డి ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య రాష్ట్ర నాయకులు కుసుంబ బాబురావు వస్కుల సైదమ్మ పోతుకంటి కాశి తదితరులు పాల్గొన్నారు.

# గూడు రాదు..గోస తీరదు.

- కాంగ్రెస్ నిర్లక్ష్యం రాయపోల్ కు శాపం.
- చాలా మంది పాత ఇండ్లను కులగొట్టుకొని ఎదురుచూస్తున్నారు.
- అద్దె ఇండ్లు,రేకుల షెడ్డులో నివాసాలు.
- రెండవ విడత లోనైనా ఇండ్లు త్వరగా ఇవ్వాలని సామాన్యుల విన్నపాలు.



**రాయపోల్,నవంబర్5,:** కాంగ్రెస్ అలసత్వం...మండల కేంద్రం రాయపోల్ కు శాపంగా మారింది.పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆశల పల్లకి ఎక్కించిన సర్కారు,ఆ తర్వాత చోద్యం చూస్తుంది.సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం పైలెట్ ప్రాజెక్ట్ మినహా 18 గ్రామ పంచాయితీలు ఉన్నాయి.మండలం లోని తిమ్మక్క పల్లి గ్రామానికి ఒక్కటంటే ఒక్కటి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయక పోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది.మండల కేంద్రం రాయపోల్ లో ఎంతో మంది నిరుపేదలు ఉన్నా అధికారులు మాత్రం 28 మందిని అర్హులుగా గుర్తించి జాబితా పంపిస్తే 13 మందికి మాత్రమే ఇండ్లు మంజూరు అయ్యాయి. మిగతా వారికి ఇండ్లు ఎప్పుడు ప్రభుత్వం మంజూరు చేస్తు0దోనని నిరుపేదలు ఎదురుచూస్తున్నారు.కాలి స్థలం ఉంటేనే ఇల్లు మంజూరు అవుతుందన్న మాటలతో ఎంతో మంది శిధిలావస్థలో ఉన్న పాత ఇండ్లను కూలగొట్టుకొని నెలల తరబడి నిరీక్షిస్తూ,కిరాయికి ఉండాల్సిన పరిస్థితి దాపురించింది.మండలపరిధి లోని కొన్ని గ్రామాలలో కొంతమంది ప్రొసీడింగ్స్ రాకముందే డెస్మెటల్ చేసుకొని ఇండ్లకోసం ఎదురుచూస్తున్నారు. అధికారులకు కలిసి విన్నవిస్తే ఇదిగో వస్తుంది,అదిగో వస్తుంది అని అనడం తప్ప వచ్చేది లేదు...ఇచ్చేది లేదు.యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి గుడు గోస తీర్చాలని వేడుకుంటున్నారు.

### ఇల్లు కూల్చి కిరాయికి ఉంటున్నా

ఉషనగల్ల కవిత,రాయపోల్.



గత ఎంపిడిఒ,హౌసింగ్ ఏఈ,సెక్రెటరీలు జాబితాలో పేరు వచ్చిందని, పాత ఇల్లు కూల్చమని చెప్పారు. అధికారులు చెప్పినరని ఇల్లు కులగొట్టుకుని కిరాయికి ఉంటు న్నాం. .3 నెలలు అవుతుంది.ఇల్లు ఇయ్యలేదు.అధికారులు కనికరించి ప్రొసిడింగ్ పేపర్ ఇయ్యాలే.

### ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి



తిమ్మకపల్లి గ్రామానికి చెందిన మాదాస్ స్వామి, విజయలది నిరుపేద కుటుంబం వారికి నివసించడానికి కనీ స గూడు లేకపో వడం తో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బిక్కు బిక్కు మంటూ రేకుల షె డ్డులో గడుపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిమ్మకపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాలే లేవేమో అన్నట్లు ఒ క్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేయక పో వడం బాధాకరం. కనీసం వారికి గుంట భూమి కూ డా లేదు. ప్రభుత్వం అధికారులు వెంటనే స్పం దించి రెండవ విడత లో నైనా తమకు ఇందిరమ్మ ఇ ల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

# ఊట్ల అయ్యప్ప ఆలయంలో కార్తీక శోభ



**పటాన్ చెరు,జిన్నారం, నవంబర్ 5 (సమయం న్యూస్):** జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఊట్ల అయ్యప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకొని, సుమారు 50 మంది అయ్యప్ప భక్తులు మాలధారణ చేసి దీక్ష స్వీకరించారు. అలాగే ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఊట్ల, దాదిగూడెం, రామ్‌నగర్ కాలనీలకు చెందిన సుమారు 20 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలలో పాల్గొని, భక్తి భావంతో పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాలలో గ్రామ మాజీ సర్పంచ్‌లు శివరాజ్, ఆంజనేయులు, వెంకట్రామ్‌రెడ్డి, గోవిందరాజు, ఆధ్యాత్మికవేత్త జహంగీర్‌రెడ్డి, వీరయ్య గురుస్వామి, జింకల శ్రీనివాస్, యాదగిరి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఊట్ల అయ్యప్ప స్వాములతో పాటు జిన్నారం, సోలక్‌పల్లి, మంగంపేట ప్రాంతాల భక్తులు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలతో ఆలయం పరిసరాలు, ఊట్ల గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది .

# నవంబర్ 25 నుంచి 28 వరకు హైటెక్స్‌లో పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 2025

- ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్




హైదరాబాద్ దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్ ను నవంబర్ 25 నుంచి మూడు రోజులపాటు హైటెక్స్ లో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ...వికసిత్ భారత్ దిశగా, స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్తుకు దారితీస్తూ 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో ను "వన్ నేషన్ వన్ ఎక్స్పో" అనే దూర దృష్టి ఉన్న థీమ్ కింద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 25న నోవోటెల్ లో నాలెడ్జ్ డే తో ఈ ఈవెంట్ ప్రారంభమవుతుందని అన్నారు. ఇందులో 1,500కి పైగా ప్రతినిధులు, 7కు పైగా అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటారు, సస్టైనబుల్ ఫీడ్ సొల్యూషన్స్, ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ప్రస్తుతం భారతదేశం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానం బ్రాయిలర్ మాంస ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉంది అని అన్నారు. మాంసం ఉత్పత్తిలో ప్రతి సంవత్సరం 8 నుంచి 10% వృద్ధి చెందుతుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రూ. 1.35 లక్షల కోట్లకు పైగా తోడ్పడుతూ, పోషకాహారం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగావకాశాల పెరుగుదలకు కీలకంగా ఉందని అన్నారు. వికసిత్ భారత్ దిశగా, భారత పౌల్ట్రీ రంగం గొప్పతనాన్ని ప్రపంచానికి ప్రదర్శించాలనే సంకల్పంతో ఐపీఇఎంఏ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ కు 50 దేశాల నుంచి 500కిపైగా ఎగ్జిబిటర్స్, 40,000కుపైగా సందర్శకులు పాల్గొంటారని తెలిపారు. 35,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఆధునిక ఎగ్జిబిషన్ స్పేస్‌లో బ్రీడింగ్, హాచరీ ఆటోమేషన్, ఫీడ్ మిల్లింగ్, వెటర్నరీ ప్రొడక్ట్స్, హౌసింగ్, సస్టైనబుల్ ప్రాక్టీసెస్ వంటి తాజా ఆవిష్కరణలు ప్రదర్శించబడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర హ్యాచరీస్ జీ ఎం కె. జి. ఆనంద్, శ్రీనివాస ఫార్మా ఎండి చిట్టూరి సురేష్ రాయుడు, నేషనల్ ఎగ్ % చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ కె. బాలస్వామి, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వి. నరసింహారెడ్డి, ఇండియన్ పౌల్ట్రీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఐపీజేఏ) అధ్యక్షుడు ఎం.కె. వ్యాస్, కర్ణాటక పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ పసుపర్తి, తమిళనాడు పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగరాజ్, ఆలిండియా పౌల్ట్రీ ప్రొడక్ట్స్ ఎక్స్ పోర్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి వలసన్ పి., తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రవీందర్ రెడ్డి, నెక్ హైదరాబాద్ జోన్ ఛైర్మన్ గుర్రం చంద్రశేఖరరెడ్డి, టీపీఎఫ్ ప్రధాన కార్యదర్శి వి. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం,పర్యావరణ రక్షణ ప్రభుత్వ ధ్యేయం

- కొత్తపల్లిలో రేషన్ బ్యాగుల పంపిణీ
- ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి



**పటాన్ చేరు, గుమ్మడిదల, నవంబర్ 5 (సమయం న్యూస్):** ప్రజల ఆరోగ్యం, పర్యావరణ రక్షణ, మరియు శుభ్రమైన గ్రామ నిర్మాణం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పటాన్ చెరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం కింద రేషన్ బియ్యం సరుకుల పంపిణీ కోసం ప్రత్యేక బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం తీసు కొచ్చిన ఈ నిర్ణయం గ్రామస్థులలో ఆనందం నింపింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నా రకం బియ్యం అందించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, నాణ్యమైన బియ్యం అందించడం ద్వారా ప్రభుత్వం పేదల పట్ల చూపుతున్న శ్రద్ధను అభినందించారు. ఇక ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ కవర్ల స్థానంలో ఈ నూతన బ్యాగులను వినియోగించాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ రక్షణ, మరియు శుభ్రమైన గ్రామ నిర్మాణం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమని నాయకులు పేర్కొన్నారు. పటాన్చెరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్త పల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అతిథిగా పాల్గొని మా ట్లాడుతూ, అవసరమైన సేవలను సమయాను కూలంగా అం దించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. తాజా మాజీ ఉప సర్పంచ్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చాకలి చంద్రయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆగం రాజు, నీరుడి నర్సింలు,కుమ్మరి శివ, తోలు ఎల్లయ్య, లక్ష్మాపురం బిక్షపతి, కొక్కొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వేలాది పేద ప్రజలకు ఇళ్లపట్టాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

- జూబ్లీహిల్స్ లో విస్తృతంగా కాంగ్రెస్ ప్రచారం
- సంగారెడ్డి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి



**పటాన్ చేరు, నవంబర్ 5 (సమయం న్యూస్):** వేలాదిమంది పేద ప్రజలకు జిల్లా పట్టాలు పంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని సంగారెడ్డి జిల్లా ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అన్నానగర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, డా. పులి అనిల్‌కుమార్ లతో కలసి ప్రచారాన్ని సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కోల్కూరి నర్సింహారెడ్డి నడిపించారు. ఈ సందర్భంగా కోల్కూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ, "వేలాది మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది" అని అన్నారు. బూత్ నంబర్లు 350, 348ల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించామని తెలిపారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుతో నియోజకవర్గం అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెడుతుందని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విక్రమ్ గౌడ్, భూషణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రజల చూపు బిఆర్ఎస్ వైపే

- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో జిన్నారం,
- గడ్డపోతారం మున్సిపల్ బీఆర్ఎస్ నేతల ఇంటింటి ప్రచారం



**పటాన్ చెరు,జిన్నారం, సెప్టెంబర్ 5(సమయం న్యూస్):** జూబ్లీహిల్స్ ప్రజల చూపు బిఆర్ఎస్ వైపే ఉందని ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్తి ఘన విజయం సాధించడం తధ్యమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి గారితో కలిసి బుధవారం ప్రచారంలో పాల్గొన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం, గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి, సంక్షేమ పథకాల కొనసాగింపుకై కారు గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, కాజిపల్లి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ భార్గవ్, జిన్నారం మండల అధ్యక్షుడు నాయి కోటి రాజేష్, యువజన విభాగం అధ్యక్షుడు ఆది రామకృష్ణ, నాయకులు బండి శ్రీకాంత్ గౌడ్, గద్దె గణేష్, నిఖిల్ గౌడ్, దేవేందర్, బాలేష్, శ్రీనివాస్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. ప్రచారంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఉత్కంఠ భరితంగా తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు



**హైదరాబాద్, క్రీడా ప్రతినిధి, నవంబర్ 5:** గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న "తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్%-%2025" బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. వివిధ దేశాల నుండి అగ్రశ్రేణి షట్లర్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో మెయిన్ డ్రా మ్యాచ్‌లు బుధవారం క్రీడాభిమానులను ఆకట్టుకుంటున్నాయి. రాజకీయ నేతలు, క్రీడా ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ఉత్సాహపరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల ఫలితంగా హైదరాబాద్ అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా అవతరిస్తోందని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రముఖులు పేర్కొన్నారు. పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత్ తో పాటు ఇతర దేశాల క్రీడాకారుల మధ్య పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి.

# కోస్గిలో హ్యాండ్ బాల్ సెలక్షన్ ట్రాయల్స్.

- క్రీడాకారులను పరిచయం చేసుకుని
- క్రీడలను ప్రారంభించిన- జిల్లా గ్రంథాలయ చెర్మైన్ వార్ల విజయకుమార్



**కోస్గి మున్సిపల్(మం)నవంబర్,05(సమయం న్యూస్) :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా హ్యాండ్ బాల్ సెలక్షన్ ట్రయల్స్ నారాయణపేట జిల్లా కోస్గి ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించినట్లు ఫిజికల్ డైరెక్టర్ నర్సింహ తెలిపారు. బుధవారం నిర్వహించిన సెలక్షన్ రాయల్స్ కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంబించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను శారీరక వికాసానికి దోహదం చేస్తాయని,వ్యక్తిగత పరిచయాలు ఏర్పడతాయని అన్నారు. ట్రాయల్స్ లో పాల్గొనే క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో జిల్లా జట్టులోకి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బెజ్జు రాములు,మండల విద్యాధికారి శంకర్ నాయక్,ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్ సాయినాథ్, రామకృష్ణారెడ్డి, ఊసురవి, హ్యాండ్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ జియావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు..

# అత్యంత వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు





**వెల్దుర్తి నవంబర్ 05, (సమయం న్యూస్) :** వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున ఆలయంలో మండల ప్రజలు కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వయంభుగా వెలసిన పుట్టు లింగానికి భక్తులు అభిషేకాలు జరిపారు. సాయంత్రం వేళ మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాల వద్దకు చేరుకొని కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే తమ గృహాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు కుటుంబ సభ్యులతో ఆలయాలకు చేరుకోవడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. దేవాలయం వద్ద వెల్దుర్తి వాస్తవ్యుడు అయిన డాక్టర్ డాక్టర్ చిప్ప శ్రీనివాస్ ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అన్నప్రసాదను తీసుకొని అన్న ప్రసాదం ను ఏర్పాటుచేసిన డాక్టర్ చిప్ప శ్రీనివాస్, ను అభినందించారు.

# నారాయణ రావు చిత్ర పటానికి నివాళులు

● అర్పించిన మద్దూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఎస్ టీ సెల్ అధ్యక్షులు క్రిష్ణానాయక్



**మద్దూరు,మండలం, నవంబర్,05(సమయం న్యూస్) :** హైదరాబాద్ లో మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ అగ్ర నేత హరీష్ రావు తండ్రి నారాయణ రావు కొద్దీ రోజుల క్రితం మరణించిన సందర్భంగా బుధవారం వారి నివాసం కొకపేటలో టి హరీష్ రావుని కలిసి వారి తండ్రి చిత్ర పటానికి నివాళులు అర్పించిన నారాయణపేట జిల్లా మద్దూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఎస్ టీ సెల్ (ST-CELL)అధ్యక్షులు క్రిష్ణానాయక్, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి గోపాల్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# మారుమూల గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి.

● సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రృతి పై ఫోకస్ పెట్టండి.



**ఆదిలాబాద్ నవంబర్05( సమయం న్యూస్). :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులు ఆదేశించారు.

ఈ మేరకు ఆయన బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆరోగ్య శాఖ, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణాలతో పాటు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉట్నూర్, బోథ్, బేల, గాదిగూడ వంటి దూర ప్రాంతాల మహిళలు, ముఖ్యంగా గర్భిణీలు మెరుగైన వైద్యసేవల కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించే సౌకర్యం కల్పించాలని సూచించారు. జిల్లాలో ఐరన్ లోప అనీమియాతో బాధపడుతున్న మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు, చికిత్సలు అందించాలని సూచిస్తూ, ఈ కార్యక్రమంపై ఆశా, ఏఎన్ఎమ్, అంగన్‌వాడీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో నమోదైన నవజాత శిశు మరణాలపై సమగ్ర విశ్లేషణ జరపాలని ఆయన సూచించారు. తల్లుల పోషకాహారం లోపం, గర్భధారణ సమయంలో అవసరమైన వైద్యపరీక్షలు చేయించుకోకపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సమయానికి చికిత్స అందకపోవడం వంటి కారణాల వల్ల తక్కువ బరువుతో పుట్టిన శిశువుల సంఖ్య పెరుగుతోందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించిన కలెక్టర్, ప్రతి పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ స్థాయిలో తల్లుల ఆరోగ్య స్థితి, హీమోగ్లోబిన్ స్థాయిలు, ఆహారపు అలవాట్లు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ వాడకం, పోషకాహార పంపిణీ వంటి అంశాలను సమీక్షించి హై రిస్క్ కేసుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి గర్భిణీ తల్లిని గుర్తించి, సమయానికి వైద్యపరీక్షలు చేయించుకోవడం, సరైన పోషకాహారం అందించడం వంటి విషయాల్లో సిబ్బంది చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, వైద్యులు అనంత్ రావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జి భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయండి.

● జిల్లా కలెక్టర్ రాజార్షి షా



**ఆదిలాబాద్ నవంబర్ 05( సమయం న్యూస్/) :** ఆదిలాబాద్ పట్టణంలో కొనసాగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి (RUB), ఓవర్ బ్రిడ్జి (ROB) నిర్మాణ పనులను వేగవంతం గా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు పాయల శంకర్‌తో కలిసి రైల్వే, రహదారులు, భవనాలు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా RUB, ROBప్రాజెక్టులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో సుమారు రూ.94 కోట్ల వ్యయంతో ఈ రెండు ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ, సాంకేతిక అనుమతులు తుది దశలో ఉన్నాయని వెల్లడించారు. డిసెంబర్‌లో పనులు ప్రారంభించి 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, రైల్వే అధికారులు మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖలతో సమన్వయం కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. శాసనసభ్యులు పాయల శంకర్ మాట్లాడుతూ, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణాలు ఇప్పుడు సాకారమవుతున్నాయని తెలిపారు. మొత్తం రూ.94 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పూర్తికానుందని పేర్కొన్నారు. డిసెంబర్‌లో పనులు ప్రారంభమవుతాయని, అవసరమైన భూసేకరణకు కూడా కేంద్రం నుంచే నిధులు అందనున్నాయని వివరించారు .రైతులు, విద్యార్థులు, రోగులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే పట్టణం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మొదటిసారిగా పూర్తిగా కేంద్ర బడ్జెట్ తో నిర్మించబడటం గర్వకారణమని పేర్కొన్నారు. రైల్వే సీనియర్ ఇంజనీర్ సాంబ శివరావు, ఆర్ అండ్ బి అధికారులు నర్సయ్య, రాజేశ్వర్, వెంకట వేణు, ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి

● టి ఎస్ ఎస్ కళాకారులతో అవగాహన సాంస్కృతిక కార్యక్రమాలు.

**మహబూబాద్ నవంబర్ 05( సమయం న్యూస్). :** కేంద్ర ప్రభుత్వం, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ వరంగల్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మరియు ప్రోగ్రాం సహాయకులు బానోతు దేవిలాల్ గారి ఆదేశాల మేరకు , మేరా యువ భారత్ ఆధ్వర్యంలో అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని కళారంజిని సందీప్ కళాబృందంచే ఈ రోజు కళారంజని సంస్కృతిక కళాకారుల మండలి సేవ సొసైటీ మహబూబాబాద్ జిల్లాలోని బస్ స్టాండ్ ఆవరణము మరియు రైల్వే స్టేషన్ ముందు ఆవరణములలో సాంస్కృతిక, నృత్య, నాటిక, పోస్టర్స్ అంటించడం కరపత్రాలు పంచటం వంటి కార్యక్రమాలు మరియు వారి ఆటపాట లతో ప్రజలను అమ్మ పేరుతో ఒక మొక్క ప్రతి ఒక్కరూ వారి ఇంటి ఆవరణంలో మొక్క నాటుకోవాలని తెలియజేస్తూ సొసైటీ కళారంజని సందీప్ టీం లీడర్, కరుణాకర్, లక్ష్మణ్, రజని వారి యొక్క కళా నృత్యాలతో ప్రజలను విద్యార్థిని విద్యార్థులను చాలా ఆకట్టుకునే విధంగా వారి యొక్క సంభాషణలతో అవగాహన కలిగించడం జరిగింది.



# భారీ వర్షాలకు నీట మునిగిన ఉద్యాన వన పంటల రక్షణ సస్య రక్షణ పద్ధతులు వివరించిన

## జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి. సునీల్ కుమార్.

**మలహర్ రావు నవంబర్ 05( సమయం న్యూస్,).:** ఈ రోజు జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీ ఏ. సునీల్ కుమార్, మల్హర్ రావు మండలము లోని ఎర్రగుంట మరియు తాడిచర్ల శివారులోని అధిక వర్షాల కారణంగా నీట మునిగిన మిరప తోటలను స్వ యంగా పరిశీలించారు. ఈ సందర్శన సందర్భంగా ఆయన రైతులతో చర్చించి, పంటను రక్షించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

తక్షణ చర్యలు...తోటల్లో నిల్వ నీటిని వెంటనే బయటకు వెళ్లేలా గుంటలు, కాలువలు త్రవ్వి డ్రైనేజీ సదుపాయాలు ఏర్పాటు చేయాలి. తోట చుట్టూ నీటి ప్రవాహం సులభంగా ఉండేలా కాల్వలు, నాళాలు శుభ్రం చేయాలి. ఈ కింద తెలిపిన నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

1. వేరుల కుళ్ళు వ్యాధి నివారణ

అధిక తేమ కారణంగా వేరుల కుళ్ళు వ్యాధి వచ్చే అవకాశముందని దీని నివారణ కొరకు నీరు తగ్గిన వెంటనే ట్రైకోడెర్మా విరైడే (Trichoderma viride) లేదా ప్సూడోమోనాస్ ఫ్లోరసెన్స్ (Pseudomonas fluorescens) కలిగిన జైవ నాశనకారిని (Bio-fungicide) వేర్ల చుట్టూ పిచికారీ చేయాలి.

1 కిలో ట్రైకోడెర్మా ం 100 కిలోల పూడి ఆవు పేడ లేదా ఎరువులో కలిపి తోటలో చల్లడం ద్వారా వేరుల వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు.

జీవ సంబంధిత పద్ధతులతో పాటు అవసరమైతే రసాయనిక ఫంగిసైడ్‌లను కూడా వాడవచ్చని సూచించారు.



రసాయనిక నియంత్రణ చర్యలలో భాగంగా,

వేరుల కుళ్ళు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ (Copper oxychloride) 3 గ్రా/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి లేదా మెటాలాక్సిల్ ం మాంకోజెబ్ (Metalaxyl + Mancozeb) 2.5 గ్రా/లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

మిరప మొక్కల పునరుద్ధరణ చర్యలు

నీరు తగ్గిన తర్వాత, మొక్కలు తిరిగి పుంజుకునేందుకు హ్యూమిక్ యాసిడ్ లేదా అమినో యాసిడ్ (%ూఎఐఅశీ ూఎఐఅం%) 3 మి.లీ/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే మైక్రోన్యూట్రియెంట్స్ కలిపి పిచికారీ చేయడం ద్వారా మొక్కలు పునరుద్ధరించుకుని ఆకులు తిరిగి పచ్చగా మారుతాయని తెలిపారు.

# బాన్సువాడ నియోజక వర్గంలో డబుల్ బెడ్ రూం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ.

## ప్రభుత్వ సలహా దారు పోచారం శ్రీనివాస్ రెడ్డి.

**బాన్సువాడ నవంబర్05( సమయం న్యూస్).:** బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసంలో బాన్సువాడ నియోజకవర్గం లోని బాన్సువాడ పట్టణం, బాన్సువాడ గ్రామీణ మండలం, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు చెందిన డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులకు 4 కోట్ల రూపాయల ఇండ్ల బిల్లులను పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారుపాల్గొన్న ఉమ్మడి బీర్కూర్ మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి దుర్గం శ్యామల శ్రీనివాస్ గారు, బాన్సువాడ పట్టణం, బాన్సువాడ గ్రామీణ మండలం, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు, లబ్ధిదారులు.



# రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాల అమలు సలహాదారు సుదర్శన్ రెడ్డి పదవి బాధ్యత స్వీకరణ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు

**హైదరాబాద్ నవంబర్05( సమయం న్యూస్) :**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ( రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సలహాదారులు ) గా బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ సుదర్శన్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ నిజామాబాద్ డిసిసిబి చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి ,పలువురు మంత్రులు శాసనసభ మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి సలహా దారు వేం నరేందర్ రెడ్డి పి సి సి అధ్యక్షుడు, మంత్రులు జిల్లా కు చెందిన శాసన సభ్యులు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# వరంగల్ మార్కెట్‌లో పత్తి సంచులు తడిచిన ఘటనపై విచారణకు మంత్రి తుమ్మల ఆదేశం

**హైదరాబాద్ నవంబర్05( సమయం న్యూస్).:**వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో 04.11.2025న భారీ వర్షం కారణంగా పత్తి సంచులు తడిచిన ఘటనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు విచారణ ఆదేశాలు జారీ చేశారు.మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ శ్రీమతి లక్ష్మీ భాయి గారి సూచనలతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ విచారణ నిర్వహించారు.విచారణలో 7329 బస్తాల పత్తిలో 59 బస్తాలు మాత్రమే తడిసినట్లు తేలింది. తడిసిన పత్తిని సిబ్బంది సహాయంతో ఆరబెట్టి అదే రోజున కొనుగోలు చేశారు.విచారణ నివేదిక ప్రకారం రైతులకు ఎటువంటి ఆర్థిక నష్టం జరగలేదు.రీజనల్ జాయింట్ డైరెక్టర్ నివేదికను మంత్రి గారికి సమర్పించిన మార్కెటింగ్ డైరెక్టర్.

# ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- నూతన ఇందిరమ్మ ఇండ్లను ఘనంగా ప్రారంభించిన
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- లబ్ధిదారులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**రాజాపూర్ నవంబర్05( సమయం న్యూస్).:** ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అనే కలను సాకారం చేయడం ప్రభుత్వం యొక్క లక్ష్యం అని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు

రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను బుధవారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గారి తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు గౌరవప్రదమైన నివాసం లభిస్తోందనీ తెలిపారు.భవిష్యత్తులో కూడా ప్రతి అర్హత గల కుటుంబం కు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరిగేలా కృషి చేస్తాం" అన్నారు.తరువాత ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ పేదల సొంతింటి కల నిజం చేయాలనే లక్ష్యం తో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు.లబ్ధిదారులు మంజూరు చేసిన ఇండ్లను నిర్మాణం చేసుకోవాలని,ప్రభుత్వం సూచించిన డిజైన్ ప్రకారం నిర్మాణం చేసుకోవాలని అన్నారుఈ కార్యక్రమంలో జిల్లా,మండల,గ్రామ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# విద్యుత్ ఉంటే పరిశ్రమలు, అనుబంధ రంగాల అభివృద్ధి

## మంత్రి మల్లు భట్టి విక్రమార్క

**పరిగి నవంబర్05( సమయం న్యూస్):** బుధవారం ఆయన వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గంలో 674 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఒక 400 కేవీ సబ్ స్టేషన్ ,తొమ్మిది 33/ 11 కెవి సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతేకాక నజీరాబాద్ తండాలో 24 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 220 కె.వి సబ్‌స్టేషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ఫార్మర్ లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎబిఎస్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల తో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యథానిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా అత్యంత నిరు పేదలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వడం జరిగిందని, ఇందులో భాగంగా1,48,193 మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గంలో44,465 మంది లబ్ధిదారులు ఉచిత విద్యుత్తు లబ్ధి పొందుతున్నారని అన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించడం ద్వారా పరిశ్రమలు వస్తాయని, తద్వారా పరిశ్రమలతో పాటు, అనుబంధ రంగాలు, విద్యా సంస్థలు తదితర రంగాలలో అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రైతులకు 27 వేల 970 వ్యవసాయ పంపు సెట్ల కు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. బీదప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు నాలుగు లక్షల 50 వేల ఇండ్లను మంజూరు చేస్తూ, ఒక్కొక్క ఇంటికి 5 లక్షల చొప్పున ఇండ్లు ను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసి ప్రతి ఇంటికి 5 లక్షల చొప్పున కేటాయించామని, రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 93 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షలతో ఏ ఆసుపత్రికి వెళ్లిన వైద్యం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను కల్పించిందని, కోర్టుకు వెళ్లిన వారికి నియామక పత్రాలను అందజేశామన్నారు. తెలంగాణలో కేవలం సంక్షేమం కోసమే 1 ఒక లక్ష 600 వేల 310 కోట్ల ను ఖర్చు చేశామన్నారు. రైతు భరోసా, రుణమాఫీ బోనస్ సన్నబియ్యం తో పాటు అనేక సంక్షేమ పథకాల కోసం ఖర్చు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేశామని ఒక్కొక్క స్కూలు 25 ఎకరాలలో 200 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. పరిగి నియోజకవర్గంలో కూడా 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూలు మంజూరు అయిందన్నారు. ఇంటర్నేషనల్ స్థాయిలో చదువు ఉండేలా ప్రపంచంతో పోటీపడేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో విద్య ఉండబోతుందని చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వారానికి మూడు రోజులు ప్రజాబాట నిర్వహించ బోతుందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులే ప్రజల వద్దకు వెళ్తారని అంబులెన్స్ లాగా ఒక వాహనం కూడా ఉంటుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచబోతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ ను ఎవరు ఆపలేరని ఏ ఒక్క ప్రతిపక్షం కూడా ఆపలేదని స్పష్టం చేశారు., ప్రతిక్షణం ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ళ మండలం మిర్జా గూడ ప్రమాద మృతులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సమావేశంలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, పరిగి నియోజక వర్గ శాసన సభ్యులు డాక్టర్ రామ్ మోహన్ రెడ్డి,ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫారుకి, ఎచ్ ఆర్ డి డైరెక్టర్ శివాజీ, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి, వికారాబాద్ ఎస్ ఇ రవి ప్రసాద్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .



# ఓటు హక్కు వినియోగించుకున్న 97 మంది వృద్ధులు ,వికలాంగులు


- ఓటు హక్కు వినియోగానికి ప్రత్యేక ఏర్పాటు.
- హెూం ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగం



**హైదరాబాద్, నవంబర్ 4, 2024:**జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంమధురానగర్ లో హెూం ఓటింగ్ ప్రక్రియను జీహెచ్ఎంసీ కమిషనర్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ మంగళవారం పరిశీలించారు .హెూం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం 103 మందిలో 97 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము-ఎస్సై -2 సత్యనారాయణ రాజు



**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్,05(సమయం న్యూస్) :** చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. కొడంగల్ ఎస్సై-2 సత్యనారాయణ రాజు తెలిపిన వివరాల మేరకు నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం రెనివట్ల గ్రామానికి చెందిన గొల్ల మల్లప్ప(45) హైదరాబాద్ లో కూలీ పని చేసుకుంటూ భార్యతో కలిసి ఉంటున్నాడు.బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చిన మల్లప్ప కొడంగల్ పట్టణంలోని వర్షకాలనీలో చెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటన పై మృతుడి భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 సత్యనారాయణరాజు తెలిపారు.

# 51.9 కేజీల గంజాయి పట్టివేత.

- కారు బైకు సీజ్... 26 లక్షల గంజాయి స్వాధీనం.
- ముగ్గురిపై కేసు నమోదు.. ఇద్దరు అరెస్ట్.

**భద్రాచలం నవంబర్05( సమయం న్యూస్).:** ఒరిస్సా నుంచి గంజాయి కేరళాకు కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై శ్రీహరి రావు సిబ్బంది కలిసి భద్రాచలం కూనవరం క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్నారు. కారు ఇంజన్ లో తనిఖీలు నిర్వహించగా గంజాయి పాకెట్లు కనిపించాయి. లభించిన గంజాయి పాకెట్లను తూకం వేయగా 51.9 నైన్ కేజీల గంజాయిగా ఉంది. పట్టుకున్న గంజాయి విలువ రూ. 26 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు. గంజాయి తో పాటు కారు ఒక బైకును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కేరళకు చెందినటువంటి జకారియా పర్యాల్, నసిర పూర్తియా వేట్టల్ లను అరెస్ట్ చేశారు. ఈ కేసులో కందుల రవి సూర్యాపేటకు చెందిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారు ఇతను పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను గంజాయిని కార్లను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ సిఐ కి అప్పగించారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్వాస్ ఖాసీం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ గణేష్ తెలిపారు. ఈ కేసును కరం చంద్ ఏఈ ఎస్ దర్యాప్తు నిర్వహించనున్నారు. గంజాయిని పట్టుకున్నటువంటి ఎక్సైజ్ సిబ్బందిని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్వాస్ కాసిం అభినందించారు.

# కృపాకాంప్లెక్స్ లో దాదాపు 35 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

**మల్కాజిగిరి నవంబర్,05( సమయం న్యూస్).:** ఈ రోజు మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ జి.హెచ్.ఎం.సి మరియు కాలనీ వాసులతో కలిసి కృపాకాంప్లెక్స్ నుండి సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ వరకు జరిగే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ మల్కాజ్గిరి సమగ్ర అభివృధికి కట్టుబడి ఉన్నామని అన్నారు.కాలనీని అనుకోని వున్న సఫిలగూడ చెరువులో సైతం అనేక అభివృధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

# పాత బ్యాంకు ఖాతాలలో ఉన్న డబ్బు మర్చిపోయారా.

**హైదరాబాద్ నవంబర్05( సమయం న్యూస్).:** దాన్ని తిరిగి పొందడంలో RBI మీకు సహాయం చేస్తుంది..మీ లేదా మీ కుటుంబం యొక్క ఖాతా 10ం సంవత్సరాల పైన నిష్క్రియంగా ఉంటే, ఆ నిధులు RBI యొక్క డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌లో ఉండవచ్చు ు కానీ, మీరు వాటిని ఇప్పటికీ తిరిగి పొందవచ్చు..

☞ క్లెయిమ్ చేయని డిపాజిట్లను తనిఖీ చేయండి: https://udgam.rbi.org.in

మీ బ్యాంకు యొక్క ఏదైనా శాఖను సందర్శించండి..

KYC సమర్పించండి. (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ID లేదా డ్రైవింగ్ లైసెన్స్ ఇత్యాది)..

మీ డబ్బును తిరిగి పొందండి. (వర్తిస్తే, వడ్డీతో సహా)..

క్లెయిమ్ చేయని డిపాజిట్లపై ప్రత్యేక శిబిరాలు: అక్టోబర్%–%డిసెంబర్ 2025..

RBI అంటోంది – విషయాలు తెలుసుకోండి, జాగ్రత్తగా ఉండండి..! (VG)

# సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సలహాదారులుగా బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ సుదర్శన్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ నిజామాబాద్ డిసిసిబి చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి ,పలువురు మంత్రులు శాసనసభ మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి సలహా దారు వేం నరేందర్ రెడ్డి పి సి సి అధ్యక్షుడు, మంత్రులు జిల్లా కు చెందిన శాసన సభ్యులు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# మైనారిటీల రిమోట్ కంట్రోల్ ఎవరి చేతిలో?

తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీ సంక్షేమం ప్రధాన అంశం. ఇటీవల మంత్రి పదవి దక్కించుకొన్న ప్రముఖ క్రీడాకారుడు మహమ్మద్ అజారుద్దీన్‌కు ప్రస్తుతం వచ్చిన అవకాశం కీలక పరీక్ష. దేశంలోనే అతి పెద్ద మైనారిటీ సముదాయానికి చెందినవారు హైదరాబాద్ కేంద్రముగా రాజకీయాలు నడుపుట విశేషం. అయితే, వారి అధికారం కేవలం ఒక నగరం, ఒక రాష్ట్రానికే పరిమితమా.. లేక గులాం నబీ ఆజాద్ లాంటి జాతీయ నాయకుడిగా ఎదుగుతారా.. అజారుద్దీన్ ముస్లిం యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. లేని పక్షంలో రాజకీయాలలో నిలదొక్కుకొనటము కష్టమవుతుంది.



### రాజకీయాలు.. 'బి-టీమ్' ఆరోపణలు?

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ పాత బస్తీకి తిరుగులేని నేత. స్థానిక ముస్లిం నాయకుడు ఎదుగకుండ, అధికారంలో ఉన్న పార్టీల పై తీవ్ర ఒత్తడి తీసుకొని వచ్చుట ఎంఐఎం ప్రధాన వ్యూహం. ఆ విధముగా, ఎంఐఎం మైనారిటీల పట్ల సానుభూతి నేతగా నిలదొక్కుకొంటున్నది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఎన్నికలలో ఎంఐఎం పోటీ చేయుట, తద్వారా బిజెపి వ్యతిరేక ఓట్లు చీలుట, బిజెపికి పరోక్ష లబ్ధి చేకూరుస్తుందనెడి 'బి-టీమ్' ఆరోపణలు అధికము. అట్టి విమర్శలు ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి పెద్ద రాష్ట్రాలలో సైతము వినిపించు చున్నవి.

### విశ్వసనీయతకు సవాలు..

ఏ ప్రభుత్వము అధికారంలో ఉన్న, ఆ పార్టీతో పొత్తు పెట్టుకొనుట, రాజకీయ లబ్ధి పొందటము ఎంఐఎం శైలిగా విమర్శకులు చెబుతారు. కేంద్రంలో బిజెపి అంతర్గతంగా మద్దతు ఇవ్వకుండ ఉన్న పక్షంలో, ఎంఐఎం నాయకులను దర్యాప్తు సంస్థల ద్వారా వేధించబడు చున్నారనెడి ప్రచారం ఉంది. అందుకే, ఎంఐఎం అంతర్గత మద్దతు ఇస్తుందనే వాదన బలంగా ఉన్నది. సీబిఐ, ఎన్ఐఏ నుంచి తప్పించుకొనే 'బి-టీమ్'గా పనిచేస్తున్నారనె విమర్శల తీవ్రత ముస్లిం వర్గాల విశ్వసనీయతకు సవాలు. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో సైతం అట్టి రాజకీయ పోకడలు నడిచినవి.

### ప్రత్యామ్నాయం లేకపోవటమే అసలు బలం..

ఎంఐఎం పట్ల ముస్లిం వర్గాలలో కొంత వ్యతిరేకత ఉన్ననూ, మరొక నాయకుడు లేకపోవుట వలన ప్రజలు ఒవైసీ వైపు మొగ్గు చూపుతున్నారు. నిజమైన, నిస్వార్థమైన నాయకుడు లేని లోటు స్పష్టముగా కనిపిస్తుంది. ఆజం ఖాన్ లాంటి మహానాయకుల ఆదర్శము, వారి పోరాట పటిమ నేటి నాయకులకు స్ఫూర్తి దాయకము. ఆజం ఖాన్ ఎల్లప్పుడూ మైనారిటీల హక్కులు, ఆత్మగౌరవము కొరకు పోరాడుతుంటారు. అట్టి నాయకత్వము ప్రస్తుత అవసరం. కేవలం స్థానిక రాజకీయాల కోసం కాకుండ, జాతీయ స్థాయిలో ప్రజా సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలి.

### అంతర్జాతీయ స్థాయిలో ప్రభావము..

మంత్రి అజారుద్దీన్ తన పదవిని దేశ వ్యాప్తంగా ముస్లిం వర్గాల నాయకుడుగా ఎదిగేందుకు ఉపయోగించుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో అట్టి స్థాయికి ఎదగగలిగితే, మైనారిటీల రిమోట్ కంట్రోల్ కొత్త శక్తి కేంద్రానికి మారుతుంది. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, సౌదీ అరేబియా రాజు సల్మాన్ బిన్ అబ్దుల్-అజీజ్ లాంటి ప్రపంచ నాయకులు భారత దేశపు ముస్లింల స్థితిగతులను, వారి నాయకత్వమును గమనిస్తుంటారు. మైనారిటీల నాయకత్వము బలహీనపడటము, లేక రాజీ రాజకీయాలకు పాల్పడుట, దేశ ప్రతిష్టను దెబ్బ తీస్తుంది. బలమైన, నిబద్ధత గల నాయకత్వమే వారికి రక్షణ.

**రిమోట్ కంట్రోల్ ఎవరి చేతిలో ఉందనేది ఆ నాయకుల విశ్వసనీయత, సాహసము పై ఆధారపడి ఉంటుంది. అజారుద్దీన్ ముందున్న సవాలు, ఒవైసీ రాజకీయాలకు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగటమే. మైనారిటీ యువత ఆయనకు అండగా నిలబడతారో లేదో కాలము నిర్ణయిస్తుంది. జాతీయ స్థాయిలో మైనారిటీ స్వరం బలంగా వినబడాలంటే, నిజమైన పోరాట పటిమ అవసరం.**

ఫిరోజ్ ఖాన్,
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464





## గాయాలు త్వరగా మానిపోవాలన్నా, నొప్పుల నుంచి ఉపశమనం లభించాలన్నా..
# ఈ చిట్కాలను పాటించండి..

క్రీడల్లో పాల్గొన్నప్పుడు, వ్యాయామం లేదా శారీరక శ్రమ చేసినప్పుడు, పలు ఇతర సందర్భాల్లో మనకు అనుకోకుండా గాయాలు అవుతుంటాయి. అవి పుండ్లుగా కూడా మారుతుంటాయి. ఈ క్రమంలోనే ఆ ప్రాంతంలో తీవ్రమైన నొప్పి కూడా ఉంటుంది. గాయాలు అయినప్పుడు రక్తస్రావం కూడా ఒక్కోసారి అధికంగా అవుతుంది. అయితే గాయాలు మరీ తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. కానీ సాధారణ గాయాలు అయినప్పుడు, పుండ్లుగా మారినప్పుడు, నొప్పి ఉన్నప్పుడు పలు ఇంటి చిట్కాలను పాటిస్తే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. మన ఇండ్లలో లభించే సహజసిద్ధమైన పదార్థాలను ఉపయోగించి గాయాలను, పుండ్లను, నొప్పిని సులభంగా తగ్గించుకోవచ్చు. అందుకు గాను ఆయా చిట్కాలు చాలా అద్భుతంగా పనిచేస్తాయి.

ఆముదం, పసుపు..

గాయాలు, పుండ్లు, నొప్పిని తగ్గించేందుకు ఆముదం అద్భుతంగా పనిచేస్తుంది. ఒక టీస్పూన్ ఆముదాన్ని తీసుకుని కొద్దిగా వేడి చేసి గాయంపై మర్దనా చేయాలి. తరువాత గాయం అయిన భాగాన్ని వస్త్రంతో చుట్టి కట్టులా కట్టాలి. 20 నుంచి 30 నిమిషాల పాటు అలాగే ఉంచి తరువాత తీసేయాలి. రాత్రి పూట కట్టు కడితే రాత్రంతా దాన్ని అలాగే ఉంచి మరుసటి రోజు ఉదయం తీసేయాలి. దీని వల్ల నూనె లోపలికి శోషించుకోబడుతుంది. దీంతో గాయం త్వరగా మానుతుంది. నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే గాయాలు, పుండ్లు, నొప్పులను తగ్గించేందుకు పసుపును కూడా ఉపయోగించవచ్చు. ఇందులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. కనుక నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. పుండ్లు త్వరగా మానిపోతాయి. అన్ని రకాల గాయాలు, నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. పావు టీస్పూన్ పసుపును ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కలిపి తాగాలి. ఉదయం, సాయంత్రం ఇలా చేయాల్సి ఉంటుంది. దీని వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**అల్లం..**

గాయాలు, పుండ్లను తగ్గించేందుకు పసుపు, నెయ్యి మిశ్రమం కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందుకు గాను కొద్దిగా పసుపు, నెయ్యిని తీసుకుని బాగా కలిపి పేస్ట్‌లా మార్చాలి. అనంతరం గాయాన్ని లేదా పుండును శుభ్రం చేసి దానిపై ముందు సిద్ధం చేసుకున్న మిశ్రమాన్ని రాసి ఆపై కట్టు కట్టాలి. ఇలా రోజుకు 2 సార్లు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల గాయాలు, పుండ్లను త్వరగా మానేలా చేయవచ్చు. అలాగే అల్లంను తీసుకున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు. ఇవి నొప్పులను తగ్గించి గాయాలు త్వరగా మానేలా చేస్తాయి. రోజువారి ఆహారంలో అల్లంను చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. అల్లం ముక్కను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. లేదా అల్లం ముక్కను నోట్లో వేసుకుని నమిలి మింగవచ్చు. లేదా అల్లం రసం తాగవచ్చు. అలాగే అల్లం రసం కలిపిన గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. దీని వల్ల కూడా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. గాయాలు త్వరగా మానుతాయి.

**ఆవనూనె..**

ఇక నొప్పులను తగ్గించి గాయాలు మానేలా చేయడంలో ఆవనూనె కూడా బాగానే పనిచేస్తుంది. ఇందులోనూ యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి మనకు ఎంతో మేలు చేస్తాయి. ఆవనూనెను కొద్దిగా తీసుకుని వేడి చేయాలి. అనంతరం దాన్ని నొప్పి ఉన్న ప్రదేశంలో రాసి సున్నితంగా మర్దనా చేయాలి. 15 నిమిషాల పాటు ఇలా చేయాల్సి ఉంటుంది. దీని వల్ల వాపు, నొప్పి తగ్గిపోతాయి. అలాగే గాయాలపై రాసి కట్టు కడితే అవి త్వరగా మానిపోతాయి. అలాగే గాయాలు అయినవారు, నొప్పులు ఉన్నవారు పలు ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పైనాపిల్ పండ్లను రోజూ తింటుండాలి. దానిమ్మ పండ్లను తింటున్నా ఉపయోగం ఉంటుంది. వీటి జ్యూస్‌ను అయినా తాగవచ్చు. అలాగే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కొద్దిగా అల్లం రసం, పసుపు వేసి కలిపి తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఈ విధంగా ఆయా చిట్కాలను పాటించడం వల్ల గాయాలు త్వరగా నయం అయ్యేలా చూసుకోవచ్చు. నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

# తరచూ ఫుట్ మసాజ్ చేయడం వల్ల ఎన్ని అద్భుతమైన లాభాలు కలుగుతాయో తెలుసా..?



ఆయుర్వేదంలో బాడీ మసాజ్‌కు ఎంతో ప్రాధాన్యతను కల్పించారన్న విషయం అందరికీ తెలిసిందే. ఆయుర్వేదంలో పలు రకాల చికిత్సా పద్ధతుల్లో భాగంగా బాడీ మసాజ్ కూడా చేస్తారు. ఇందుకు గాను పలు రకాల నూనెలను పలు ఔషధాలతో కలిపి ఉపయోగిస్తారు. తరువాత స్టీమ్ బాత్ లేదా స్నానం చేయాల్సి ఉంటుంది. ఇలా ఆయుర్వేదంలో కొన్ని రకాల చికిత్సల్లో పద్ధతులను అనుసరిస్తారు. దీని వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయి. వారంలో కనీసం ఒకసారి అయినా సరే ఇలా బాడీ మసాజ్ చేసుకుని స్నానం చేయాలని ఆయుర్వేదం చెబుతోంది. అందుకనే చాలా మంది సెలబ్రిటీలు కూడా ఇలా తరచూ పాటిస్తుంటారు. అయితే బాడీ మసాజ్ మాత్రమే కాకుండా ఆయుర్వేదంలో ఫుట్ మసాజ్.. అంటే పాదాల మసాజ్‌కు కూడా అధిక ప్రాధాన్యతను కల్పించారు. దీని వల్ల కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

**మానసిక సమస్యలకు..**

మన శరీరంలో భిన్న అవయవాలకు మసాజ్ చేస్తే భిన్న రకాల లాభాలు కలుగుతాయి. అయితే దాదాపు అన్ని అవయవాలను కలిపే నాడులు మాత్రం పాదాలకు అనుసంధానమై ఉంటాయి. అందువల్ల పాదాలకు మసాజ్ చేస్తే అనేక అవయవాలు, కణాలు ఉత్తేజితం చెందుతాయి. దీంతో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుకనే ఫుట్ మసాజ్‌కు అంతటి ప్రాధాన్యత ఏర్పడింది. ఫుట్ మసాజ్ చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. దీంతో రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. మానసిక సమస్యలు ఉన్నవారికి, మానసిక ఆరోగ్యం సరిగ్గా లేని వారికి ఫుట్ మసాజ్ ఎంతో దోహదం చేస్తుంది. దీని వల్ల ఆయా సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు.

**స్త్రీల ఆరోగ్యానికి..**

ఫుట్ మసాజ్ వల్ల శరీరంలోని అనేక నాడులు యాక్టివేట్ అవుతాయి. దీంతో శరీరానికి ఉత్తేజం లభిస్తుంది. ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట తగ్గుతాయి. బద్దకం పోతుంది. ఇక ఫుట్ మసాజ్ వల్ల మహిళలకు ఎంతో మేలు జరుగుతుంది. నాడులు రిలాక్స్ అవుతాయి. హార్మోన్ల పనితీరు మెరుగు పడుతుంది. దీని వల్ల నెలసరి సక్రమంగా వస్తుంది. రుతు సమస్యలు తొలగిపోతాయి. అధిక రక్తస్రావం ఉండదు. మెనోపాజ్ దశలో ఉండే మహిళలు చికాకు, ఆందోళనను తగ్గించుకోవచ్చు. శరీరం అసౌకర్యంగా ఉందన్న భావన తొలగిపోతుంది. గర్భిణీలకు ఫుట్ మసాజ్ వల్ల ఎంతో మేలు జరుగుతుంది. పాదాల వాపులను తగ్గించుకోవచ్చు. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. సుఖ ప్రసవం అయ్యేందుకు వీలు కలుగుతుంది. పాదాల్లో నీరు తగ్గి వ్యాధులు రాకుండా ఉంటాయి.



**మెదడు ఆరోగ్యానికి..**

ఫుట్ మసాజ్ వల్ల కళ్లకు సంబంధించిన అనేక నాడులు ఉత్తేజితం చెందుతాయి. దీని వల్ల కంటి చూపు మెరుగు పడుతుంది. కంటి సమస్యలు తగ్గుతాయి. కండరాలకు కూడా ఈ మసాజ్ ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల కండరాల బలహీనత తొలగిపోతుంది. కండరాల నొప్పులు తగ్గుతాయి. అలాగే మెదడు పనితీరు మెరుగు పడి యాక్టివ్‌గా మారుతారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. వృద్ధాప్యంలో అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఫుట్ మసాజ్ వల్ల తలకు అనుసంధానం అయి ఉండే నాడులు సైతం ఉత్తేజితం చెందుతాయి. దీని వల్ల తలకు రక్త సరఫరా మెరుగు పడుతుంది. తలనొప్పి తగ్గుతుంది. పాదాలకు, వెన్నెముకకు కలిపే నాడులు పాదాలలో ఉంటాయి. కనుక ఫుట్ మసాజ్ చేస్తే ఆయా నాడులు సైతం యాక్టివేట్ అవుతాయి. దీని వల్ల వెన్నెముకకు శక్తి లభించి వెన్నెముక బలంగా మారుతుంది. ఇలా ఫుట్ మసాజ్ చేయడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# తిరిగి టీంలోకి రిషబ్ పంత్

## దక్షిణాఫ్రికాతో టెస్ట్ జట్టు ప్రకటన




దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్ కోసం టీమ్ ఇండియాను ప్రకటించింది. రిషబ్ పంత్ తిరిగి జట్టుకు వైస్ కెప్టెన్‌గా వచ్చాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత్ ఆడుతున్న మూడో టెస్ట్ సిరీస్ ఇది. బుధవారం నాడు ప్రెస్ రిలీజ్ విడుదల చేస్తూ బీసీసీఐ జట్టును ప్రకటించింది. నేషనల్ టీమ్‌తో పాటు, బోర్డు దక్షిణాఫ్రికా 'ఎ'తో 3 వన్డే మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇండియా 'ఎ' జట్టును కూడా ప్రకటించింది. దీనికి తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ పర్యటనలో నాల్గో టెస్ట్‌లో పంత్‌కు గాయమైంది, ఇందులో అతని కాలి వేలికి ఫ్రాక్చర్ అయింది. ఆ తర్వాత అతను ఆసియా కప్, వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియా పర్యటనలకు దూరమయ్యాడు. 100 రోజులకు పైగా తర్వాత అతను తిరిగి వచ్చాడు. ఆకాష్ దీప్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. పంత్ రాకతో ఎన్ జగదీశన్ జట్టు నుంచి బయటకు వెళ్లవలసి వచ్చింది. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకాష్ దీప్ వచ్చాడు.

**దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ కోసం భారత్ జట్టు**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్, వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాష్ దీప్.

# అభిషేక్, గిల్‌పై యువరాజ్‌సింగ్ ఫైర్




అభిషేక్ శర్మ, శుభ్‌మాన్ గిల్ భారత క్రికెట్ భవిష్యత్తుగా మారిపోయారు. ఈ ఇద్దరు ఆటగాళ్లకు చాలా సారూప్యతలు ఉన్నాయి. ఒకటి వీరిద్దరు చిన్ననాటి స్నేహితులు కాగా, దాదాపు 13-14 సంవత్సరాల వయస్సు నుంచే కలిసి క్రికెట్ ఆడుతున్నారు. స్నేహితులుగా ఉండటమే కాదు, ఇద్దరు ఒకే గురువు దగ్గర చిట్కాలు నేర్చుకున్నారు. వీరి గురువు యువరాజ్ సింగ్. అయితే, తాజాగా వీరికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన తన ఇద్దరు శిష్యుల ఫొటోలను చూసిన యువరాజ్ సింగ్ కోపంగా ఉన్నాడు. భారత జట్టు ప్రస్తుతం టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. నాల్గవ టీ20 నవంబర్ 6న గోల్డ్ కోస్ట్‌లో జరగనుంది. కానీ దానికి ముందు, అభిషేక్, శుభ్‌మాన్ సముద్రాన్ని ఆస్వాదించడానికి గోల్డ్ కోస్ట్‌కు వెళ్లారు. వారు బీచ్‌లో సరదాగా గడపడమే కాకుండా సముద్రంలోకి చొక్కా లేకుండా కూడా వెళ్లారు. అభిషేక్ శర్మ శుభ్‌మాన్ గిల్‌తో బీచ్‌లో సరదాగా గడిపిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినప్పుడు, యువరాజ్ సింగ్ కోపంగా ఉన్నాడు. అభిషేక్ పోస్ట్‌పై వ్యాఖ్యానిస్తూ, అతను పంజాబీలో "జుటి లావన్ దోనా దే" అని రాసుకొచ్చాడు. అంటే, "నేను మీ ఇద్దరినీ నా బూట్లతో కొడతాను" అంటూ ఫైర్ అయ్యాడు. యువరాజ్ సింగ్ తన శిష్యులను సరదాగా షూలతో కొడతానంటూ కామెంట్ చేశాడు. అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఇద్దరూ జట్టులో స్టార్ బ్యాటర్స్. ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లో ఇన్నింగ్స్‌ను ప్రారంభించే బాధ్యత వారిపై ఉంది. సిరీస్‌లోని మొదటి మూడు టీ20లలో, అభిషేక్ శర్మ ఒక మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్ అంతగా రాణించలేదు. టీ20 సిరీస్ గెలవాలంటే భారత్ చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవాలి. ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టుకు కూడా ఇదే లక్ష్యం అవుతుంది. ఒక గురువుగా, యువరాజ్ సింగ్ కూడా తన శిష్యుడు సరదాగా గడపాలని కోరుకుంటాడు. కానీ అతను గతంలో ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిచినట్లుగానే, భారత జట్టు తరపున సిరీస్ విజయంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాడు.

# హారిస్ రౌఫ్ మూల్యాన్ని చెల్లించుకున్నాడు

సెప్టెంబర్ లో జరిగిన ఆసియా కప్ సమయంలో క్రికెట్ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు ఐసీసీ చర్యలు చేపట్టింది. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్ లపై ఐసీసీ చర్యలు తీసుకుంది. ఆసియా కప్ టోర్నమెంట్ సమయంలో 4 డీమెరిట్ పాయింట్లు రావడంతో హారిస్ రౌఫ్‌ను 2 వన్డే మ్యాచ్‌ల నుండి సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. పాక్ పేసర్ రౌఫ్ కు భారత్ తో జరిగిన 2 వేర్వేరు ఘటనలకుగాను 30-30 శాతం జరిమానా విధించారు. దీనితో పాటు దక్షిణాఫ్రికాతో మంగళవారం ప్రారంభమైన వన్డే సిరీస్ లో 2 మ్యాచ్ ల నుండి హారిస్ రౌఫ్‌ను నిషేధించారు. నవంబర్ 6న జరిగే రెండో మ్యాచ్ లో కూడా అతను ఆడేందుకు అవకాశం లేదు. హారిస్ రౌఫ్ కు ఈ 2 ఘటనలకు గాను నాలుగు డీమెరిట్ పాయింట్లు వచ్చాయి. వీటిని ఐసీసీ నిబంధనల ప్రకారం 2 సస్పెన్షన్ పాయింట్లుగా మార్చింది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ పై మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది ఐసీసీ. సూర్య సైతం క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించినట్లు భావించింది. భారత కెప్టెన్ పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు సంఘీభావం తెలుపుతూ భారత సాయుధ దళాలకు మద్దతు ఇచ్చాడు. జస్ప్రీత్ బుమ్రాపై కూడా ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. ఎందుకంటే పాక్‌తో జరిగిన ఫైనల్లో రౌఫ్ ను ఔట్ చేసిన తర్వాత అతను 'విమానం కూలిపోయింది' అని సైగ చేశాడు. సూర్యకుమార్ చేసిన వ్యాఖ్యలపై 30 శాతం జరిమానా విధించింది. ఈ వార్తను మొదట సెప్టెంబర్ 26న పిటిఐ రిపోర్ట్ చేసింది. సెప్టెంబర్ 14న జరిగిన మ్యాచ్ లో విమానం కూలిపోవడాన్ని సూచించే అభ్యంతరకరమైన సంజ్ఞలు చేసినందుకు హారిస్ రౌఫ్ తప్పు చేసినట్లు ఐసీసీ తేల్చింది. రౌఫ్ ఆపరేషన్ సింధూర్ లో భారత సైనిక చర్యను ఎగతాళి చేశాడు. ఈ ఘర్షణలో 6 భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్తాన్ చేసిన వాదనకు మద్దతు తెలిపాడు.




సెప్టెంబర్ 28న బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు భారత అభిమానులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తూ, రౌఫ్ అదే సంజ్ఞను మరోసారి చేశాడు. పాకిస్తాన్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్ కు కూడా ఒక డీమెరిట్ పాయింట్ ఇచ్చారు. భారత ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ ను ఎలాంటి జరిమానా లేదా డీమెరిట్ పాయింట్ విధించలేదు. ఫర్హాన్ భారత్ పై హాఫ్ సెంచరీ చేసిన తర్వాత బ్యాట్ తో తుపాకీని కాల్చినట్లు సంజ్ఞ చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. సెప్టెంబర్ 14, 2025న 'సూర్యకుమార్ యాదవ్ (భారత్) ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని నిబంధన 2.21 ను ఉల్లంఘించాడు. ఇది క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించినది. సూర్య మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధిస్తున్నాం. 2 డీమెరిట్ పాయింట్లు ఇస్తున్నామని' ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం 'సాహిబ్జాదా ఫర్హాన్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని పేర్కొంది. 'హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. రౌఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించాం. ఫలితంగా అతనికి 2 డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' ఐసీసీ పేర్కొంది. అర్షదీప్ విషయం సోషల్ మీడియా క్లిప్ నకు సంబంధించినది. అతను పాకిస్తాన్ అభిమానులను ఎగతాళి చేస్తూ కనిపించాడు. అయితే ఐసీసీ మ్యాచ్ రిఫరీకి ఇది అభ్యంతరకరంగా అనిపించలేదు. సెప్టెంబర్ 21న భారత్, పాకిస్తాన్ సూపర్ 4 మ్యాచ్ కు సంబంధించినది. సెప్టెంబర్ 28న జరిగిన ఫైనల్ లో చేసిన చర్యలకు విధించిన ఆంక్షలపై ఐసీసీ ఇలా స్పందించింది. 'జస్ప్రీత్ బుమ్రా (భారత్) క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించిన నిబంధన 2.21 కింద మోపబడిన ఆరోపణను, ప్రతిపాదిత అధికారిక హెచ్చరికను అంగీకరించాడు. ఫలితంగా అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని తెలిపింది. మునుపటి విచారణ సమయంలో తనను తాను నిర్దోషిగా చెప్పుకున్న రౌఫ్, భారత ప్రేక్షకులకు మళ్లీ అభ్యంతరకరమైన సంజ్ఞలు చేస్తూ కనిపించాడు. 'ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ నిర్వహించిన విచారణ తర్వాత హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) మళ్లీ నిబంధన 2.21 ను ఉల్లంఘించాడని తేలింది. అతనికి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించగంతో పాటు 2 అదనపు డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' తెలిపింది.



## ట్రోఫీని టాటూ వేయించుకున్న హర్మన్

ఇండియా ఉమెన్స్ టీమ్ మొదటిసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడింది. నవంబర్ 2న నవీ ముంబై వేదికగా జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ 2025 ఫైనల్ మ్యాచ్‌లో.. దక్షిణాఫ్రికాను ఓడించి హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమిండియా విశ్వ విజేతగా నిలిచింది. దీంతో సర్వత్రా భారత్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. అయితే ఈ గెలుపును ఎప్పటికి గుర్తుంచుకునేలా.. టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఓ నిర్ణయం తీసుకుంది. ప్రపంచకప్ ట్రోఫీని టాటూగా తన చేయిపై వేయించుకున్నవిషయాన్ని.. సోషల్ మీడియా వేదికగా తన ఫ్యాన్స్‌తో పంచుకుంది. వరల్డ్ కప్ ట్రోఫీతో పాటు గెలిచిన సంవత్సరం (2025), ఎన్ని పరుగుల తేడాతో (52 పరుగుల) గెలిచిందనే విషయాలు తెలియజేసేలా నెంబర్స్ టాటూలో ఉన్నాయి. నా చర్మంలో, నా మనసులో ఎప్పటికీ చెక్కు చెదరదు. ఫస్ట్ డే నుంచి నీ కోసం వేచి చూస్తున్నాను. ఇక ఇప్పుడు ప్రతి రోజు లేవగానే మార్నింగ్ నిన్ను చూస్తూ ఉంటానంటూ.. టాటూను పంచుకుంటూ హర్మన్ క్యాప్షన్ పెట్టింది. ప్రస్తుతం ఈ కెప్టెన్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మెగాటోర్నీలో హర్మన్ అటు బ్యాటర్‌గా, ఇటు కెప్టెన్‌గా అద్భుతంగా రాణించింది. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో కీలకమైన సమయంలో ప్రత్యర్థి జట్టును ఆశ్చర్యానికి గురిచేస్తూ.. ఓపెనర్ షెఫాలీ వర్మకు బంతిని ఇచ్చింది. హర్మన్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు బాగా కలిసి వచ్చింది. ఇక కెప్టెన్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. షెఫాలీ వర్మ కూడా వరుస ఓవర్లలో రెండు వికెట్లు తీసి మ్యాచ్‌లో భారత్ పుంజుకునేలా చేసింది. హర్మన్ ఈ టోర్నీలో 8 ఇన్నింగ్స్‌ల్లో 32.50 సగటు 89.4 స్ట్రైక్‌రేట్‌తో 260 పరుగులు చేసింది.

## సమష్టి ప్రదర్శనతోనే చిరస్మరణీయ విజయం

### మహిళల విజయంపై ఐసీసీ ఛైర్మన్ జై షా




మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో అర్ధశతాబ్దపు కలను సాకారం చేసుకుంది. 2005, 2017 ఫైనల్లో తృటిలో టైటిల్ చేజారగా.. ఈసారి మాత్రం భారత మహిళల జట్టు ఏ తప్పు చేయలేదు. ఒత్తిడిని చిరునవ్వుతో ఛేదిస్తూ తొలిసారి ఫైనల్ చేరిన సౌతాఫ్రికాను మట్టికరిపించింది. 1983 ప్రపంచకప్‌లో కపిల్ సేన సాధించిన విజయం భారత క్రికెట్ గతిని మార్చినట్టే.. హర్మన్ సేన సాధించిన తాజా విజయం మహిళల క్రికెట్‌ను మరో మెట్టెక్కించనుంది. ఫైనల్లో షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోతో పాటు అమన్‌జోత్ కౌర్ మ్యాచ్ విన్నింగ్ క్యాచ్ టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించాయి. తెలుగు తేజం శ్రీచరణి టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబర్చగా.. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్‌తో బ్యాట్‌తో సత్తా చాటారు. ఈ విజయం నేపథ్యంలో భారత మహిళా క్రికెటర్లపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. తాజాగా భారత మహిళల విజయంపై స్పందించిన ఐసీసీ ఛైర్మన్ జై షా.. సమష్టి ప్రదర్శనతోనే ఈ చిరస్మరణీయ విజయం దక్కిందని చెప్పాడు. 'నాకు మహిళల క్రికెట్ అంటే చాలా ఇష్టం. భారత మహిళల జట్టు ఐసీసీ ట్రోఫీని నెగ్గడం సంతోషంగా ఉంది. ఇలాంటి విజయం, మహిళల క్రికెట్ అభివృద్ధి కావడం వంటి పరిణామాలన్నీ మన కళ్ల ముందే కార్యరూపం దాల్చాయి. అందుకోసం ప్రత్యక్షంగా, తెర వెనుక పనిచేస్తోన్న కష్టానికి ఇదే నిదర్శనం.'అని జైషా పేర్కొన్నాడు.

## ఉత్కంఠ భరితంగా తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు



హైదరాబాద్, క్రీడా ప్రతినిధి, నవంబర్ 5: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న "తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్-2025" బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. వివిధ దేశాల నుండి అగ్రశ్రేణి షట్లర్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో మెయిన్ డ్రా మ్యాచ్‌లు బుధవారం క్రీడాభిమానులను ఆకట్టుకుంటున్నాయి. రాజకీయ నేతలు, క్రీడా ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ఉత్సాహపరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల ఫలితంగా హైదరాబాద్ అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా అవతరిస్తోందని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రముఖులు పేర్కొన్నారు. పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత్ తో పాటు ఇతర దేశాల క్రీడాకారుల మధ్య పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి.

# పెద్దిలో చికిరి చికిరి స్టెప్పులు



రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. జాన్వీ కథానాయిక కాగా ఆస్కార్ విన్నర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ షాట్ వీడియో ప్రపంచ వ్యాప్తంగా తెగ వైరల్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతుండగా ఇటీవలే శ్రీలంకలో ఓ పాట సైతం చిత్రీకరణ పూర్తి చేసుకుని టీం తిరిగి వచ్చింది. వచ్చే మార్చిలో ఈ మూవీ ప్రేక్షకులకు ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి ఒక్కొక్కటిగా అప్డేట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి పాట రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బుచ్చి బాబు సానా పాటకు సంబంధించి బుధవారం చిన్న గ్లిమ్స్ రిలీజ్ చేసి నవంబర్ 7, శుక్రవారం రోజున పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బుచ్చిబాబు ఏకంగా ఈ సినిమా సంగీత దర్శకుడు రెహమాన్ నే రంగంలోకి దింపాడు. ఆయనతో తన ఫస్ట్ ఇంటరాక్షన్ గురించి వివరించి చివరకు ఈ సినిమా సాంగ్ సిట్యూవేషన్ చెప్పి ఓ ట్యూన్ అడగడం అయన వెంటనే చికిరి చికిరి అంటూ ఓ ట్యూన్ ఇవ్వడం అంతా చకచకా జరిగిపోయినట్లు చూపించారు. చివర్లో పాట ట్యూన్‌కు తగ్గట్టు రామ్‌చరణ్ వేసిన స్టెప్స్ ను సైతం చూపించి ఒక్క సారిగా పాటపై హైప్ పెంచేశారు. ఈ వీడియో బయటకు వచ్చిన క్షణాల్లోనే రామ్ చరణ్ హుక్ స్టెప్ సోషల్ మీడియాను కమ్మేసింది. రామ్ చరణ్ , మెగా అభిమానులే కాక చాలామంది నెటిజన్లు సైతం ఈ వీడియోకు, ఆ స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. రానున్న నెలరోజులు ఈ పాట ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎక్కడ చూసినా రామ్ చరణ్ స్టెప్పులే దర్శణమివడం గ్యారంటీ.

## రాహుల్ తాళి వ్యాఖ్యలపై దుమారం



అందాల రాక్షసి'తో హీరోగా, చి ల సౌ సినిమాతో దర్శకుడిగా మంచి పేరు సంపాదించుకున్న రాహుల్ రవీంద్రన్ ఇటీవల మంగళ సూత్రం విషయంలో చేసిన కామెంట్లు పెద్ద రచ్చ చేస్తున్నాయి. చూస్తూ ఉంటే సమస్య అంతకంతకు పెరిగేలానే ఉంది. ఇప్పటికే ఆయన భార్య, గాయని చిన్మయి తరుచూ పలు కామెంట్లతో నిత్యం వార్తల్లో నిలుస్తూ ఉన్న సంగతి తెలిసిందే. ఆ ఇష్యూలు అలా ఉండగానే ఇప్పుడు రాహుల్ మాట్లాడిన మాటలు పెద్ద దుమారమే రేపుతున్నాయి. గీతా ఆర్ట్స్ సమర్పణలో రష్మిక మందన్నా కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' మరో రెండు రోజుల్లో 7న) విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న రాహుల్, ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పెళ్లి తర్వాత మహిళలు తప్పనిసరిగా మంగళసూత్రం ధరించాలనే ఆచారాన్ని నేను సమర్థించను. అది పూర్తిగా నా భార్య చిన్మయి ఇష్టం. నేను ఎప్పుడూ ఆమెపై బలవంతం చేయలేదు. ఒక మహిళ మెడలో తాళి ఉంటేనే ఆమె పెళ్లయిందని ఎందుకు గుర్తించాలి? మగవాడికి అలాంటి గుర్తు ఉండదు కదా? ఇది లింగ వివక్షలోకి వస్తుంది. సమాన హక్కులు రావాలంటే ఇలాంటి పాత ఆచారాలను ప్రశ్నించాలని చెప్పారు. ఈ వ్యాఖ్యలు వైరల్ అవ్వడంతో సోషల్ మీడియాలో విపరీతమైన స్పందన వస్తోంది. కొంతమంది నెటిజన్లు రాహుల్-చిన్మయి దంపతులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. నీ భార్య తాళి వేసుకోదు.. నువ్వు జంధ్యం వేసుకున్నావా?, హిందూ సంప్రదాయాలను ఎందుకు అవమానిస్తున్నావు? అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం రాహుల్ అభిప్రాయాన్ని సమర్థిస్తూ.. ప్రతి ఒక్కరికీ తమ ఆలోచన స్వేచ్ఛ ఉంది. సమాజం మారాలంటే ఇలాంటి అభిప్రాయాలు రావాలి అని చెబుతున్నారు. ఇక చిన్మయి కూడా తన భర్తకు మద్దతుగా స్పందించింది. ఒక నెటిజన్ మంగళసూత్రం స్త్రీకి భద్రత ఇస్తుందని రాయగా, చిన్మయి సమాధానంగా.. మంగళసూత్రం లైంగిక దాడులు లేదా వేధింపులను ఆపలేదు. పుట్టిన పిల్లలపైనా దారుణాలు జరుగుతున్నాయి కదా అప్పుడు తాళి ఎలా రక్షిస్తుంది?అని కౌంటర్ ఇచ్చింది. ఈ వ్యాఖ్యలతో రాహుల్,చిన్మయి దంపతులపై సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతోంది.



## బోర్డర్-2 నుంచి వరుణ్ ధావన్ లుక్ విడుదల

వరుస సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్న బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం బోర్డర్ 2. ఈ సినిమాకు సినిమాకు అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహించనుండగా.. భూషణ్‌కుమార్, కృష్ణన్ కుమార్, జేపీదత్తా, నిధిదత్తా కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ ధావన్, దిలిజిత్ దోసాంజే, అహాన్ శెట్టి, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ నుంచి చిత్రబృందం తాజాగా వరుణ్ ధావన్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. వరుణ్ ధావన్ ఇందులో హోషియర్ సింగ్ దాహియా అనే పాత్రలో కనిపించబోతుండగా ఈ ఫస్ట్ లుక్‌లో వరుణ్ ధావన్ గన్ పట్టుకుని శత్రువులను కాల్చుతున్నట్లు కనిపిస్తుంది.



## మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాధ తెలుస్తుంది

### టీవీ షోలో రష్మిక మందన్న సంచలన కామెంట్స్

ఈ ఏడాది ఇండియన్ సినీ పరిశ్రమలో రష్మిక మందన్నా సందడి ఎక్కువగా కనిపిస్తోంది. నెల, రెండు నెలల గ్యాప్‌లో ఓ సినిమా విడుదల చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటివరకు ఆమె నటించిన నాలుగు సినిమాలు థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించాయి. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'పుష్ప 2' తో రష్మిక తన సత్తా చాటుకోగా, ఈ ఏడాది 'ఛావా', 'సికందర్', 'కుబేర', 'థామా' చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో రష్మిక పలు ప్రమోషనల్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. షోలు, ఇంటర్వ్యూలలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఆమె జగపతిబాబు హోస్ట్‌గా రన్ అవుతున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షోలో పాల్గొని సందడి చేసింది. ఈ సందర్భంగా రష్మిక తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంటూ, స్కూల్ రోజుల్లో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసింది. జగపతిబాబు అడిగిన ప్రశ్నలకు రష్మిక ఇచ్చిన సరదా సమాధానాలు ప్రేక్షకులను అలరించాయి. అంతేకాకుండా, షోలో రష్మిక మహిళలకు సంబంధించిన సమస్యలపై మాట్లాడింది. 'మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని అనిపించింది. ఆ సమయంలో మహిళలు ఎదుర్కొనే నొప్పి, బాధ ఎలా ఉంటుందో అబ్బాయిలు కూడా అనుభవిస్తే వారికి అర్థం అవుతుందని చెప్పి అందర్నీ ఆకట్టుకుంది. ఆమె మాటలకు జగపతిబాబు, ఆడియెన్స్ ఇద్దరూ చప్పట్లు కొట్టారు. ఇక రష్మిక నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీగా తెరకెక్కింది. దీక్షిత్ శెట్టి హీరోగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా, ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ప్రేమకథలోని కొత్త కోణాన్ని చూపించబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమా చూసిన తర్వాత అమ్మాయిలు తమ లవర్స్ గురించి ఆలోచించేలా ఉంటుందని ఆయన చెప్పడం విశేషం. ప్రస్తుతం రష్మిక మందన్నా 'మైసా' అనే లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తోంది. అదనంగా బాలీవుడ్‌లో ఒక కొత్త ప్రాజెక్ట్‌లోనూ భాగమవుతోంది. అంతేకాకుండా విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంక్రిత్యాన్ దర్శకత్వంలో ఒక పీరియాడిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌లో నటిస్తోంది. పలు క్రేజీ ప్రాజెక్టులపై చర్చలు కొనసాగుతున్నాయని సినీ వర్గాల సమాచారం.

## మోహన్ లాల్ తనయుడు ప్రణవ్ లాల్ మూవీ డిఎస్ ఈరే

మలయాళ స్టార్ నటుడు మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ లాల్ చాలా రోజుల తర్వాత నటిస్తున్న తాజా చిత్రం 'డీయస్ ఈరే'. ఈ సినిమాకు బ్రహ్మయుగం దర్శకుడు రాహుల్ సదశివన్ దర్శకత్వం వహించగా మలయాళంలో ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం తెలుగులో నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతుంది.



## అనగనగా ఒక రాజులో పాట పాడిన నవీన్

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**